## నామినేటెడ్ పదవులపై ఆశ

హైదరాబాద్,పార్లమెంట్ ఎన్నికల కోడ్ ముగియడంతో నామినేటెడ్ పదవులపై కాంగ్రెస్ శ్రేణుల్లో ఆశలు చిగురిస్తున్నాయి. వరుసగా ఎన్నికల్లో శ్రమించిన నాయకులు, కార్యకర్తలు ఈ పదవుల కోసం కొన్నాళ్లుగా వేచిచూస్తున్నారు. రాష్ట్ర స్థాయి కార్పొరేషన్లు నుంచి వ్యవసాయ మార్కెట్ కమిటీ ఛైర్మన్, ఆలయాల కమిటీ ఛైర్మన్ల పదవుల కోసం ముందస్తుగా నేతల వద్ద పైరవీలు వేసేస్తున్నారు. పదవుల కోసం ఎమ్మెల్యేలు, కీలక నేతల చుట్టూ చక్కర్లు కొడుతు, హామీలు తీసుకుంటున్నారు. పదేళ్ల తర్వాత రాష్ట్రంలో పార్టీ అధికారంలోకి రావడంతో కాంగ్రెస్ పార్టీలో నామినేటెడ్ పదవుల ఆశలు పెరిగిపోయాయి. లోక్ సభ ఎన్నికలు ముగియడంతో త్వరలోనే భారీ సంఖ్యలో నామినేటెడ్ పదవులు భర్తీ చేస్తారన్న ఊహాగానాలతో నాయకులు, కార్యకర్తలో జోష్ పెరిగింది. జిల్లాలో అసెంబ్లీ, ఎమ్మెల్సీ బై పోల్, ఎంపీ ఎన్నికల్లో కష్టపడి పనిచేసిన నేతలు స్థానిక సంస్థల్లో పోటీ చేయడంతో పాటు నామినేటెడ్ పదవుల కోసం ప్రయత్నాలను ముమ్మరం చేస్తున్నారు. రాష్ట్ర స్థాయిలో కార్పొరేషన్ చైర్మన్లు, జిల్లాలో వ్యవసాయ మార్కెట్ కమిటీలు, గ్రంథాలయ, దేవాలయాల


# అగ్రనేత

తెలుగు దిన పత్రిక

TELTEL/2015/66279

రంగారెడ్డి | సంపుటి: 09 సంచిక :103 | ఎడిటర్ : ఉప్పుగల్ల సంతోష్ కుమార్ | తేది: శనివారం 15-06-2024 | పేజీలు:4 వెల: 2.00


## విద్యుత్ కొనుగోళ్లపై నోటీసులు...కెసిఆర్ వివరణపై సర్వత్రా ఉత్కంఠ



హైదరాబాద్,జూన్ 14: తెలంగాణలో విద్యుత్ కొనుగోలు,కొత్త ప్రాజెక్టుల నిర్మాణ టెండర్లపై ఎల్ నరసింహారెడ్డి కమిషన్ బీఆర్ఎస్ అధ్యక్షుడు , మాజీ సీఎం కేసీఆర్ ను వివరణ కోరింది. దీంతో ఆయన నిర్ణయంపై ప్రస్తుతం సర్వత్రా ఉత్కంఠ నెలకొంది. పార్లమెంట్ ఎన్నికలకు ముందే కేసీఆర్‌కు కమిషన్ నోటీస్ జారీ చేసింది. అయితే పార్లమెంట్ ఎన్నికలు ఉన్నందున జులై 30వ తేదీ వరకు వివరణకు అవకాశం ఇవ్వాలని కోరారు. అయితే కమిషన్ మాత్రం జూన్ 15వ తేదీ వరకు గడువు ఇచ్చింది. ఈ గడువు శనివారంతో ముగియనుండంతో కేసీఆర్ ఏ నిర్ణయం తీసుకుంటారో అన్న విషయం హాట్ టాపిక్‌గా మారింది. ఎన్నికలు ముగియడంతో ఈ అంశంపై లిఖిత పూర్వక వివరణ పంపించేందుకు న్యాయ నిపుణులతో కేసీఆర్ సంప్రదింపులు జరుపుతున్నారు. లిఖిత పూర్వక వివరణ పంపించేందుకు కేసీఆర్ తర్జన భర్జన పడుతున్నట్లు సమాచారం. గడువులోగా ఆయన నుంచి సమాధానం రాకపోతే కమిషన్ ఏ నిర్ణయం తీసుకుంటుందోనన్న విషయంపై ఆశక్తి రేపుతోంది. గడువును పొడిగిస్తుందా? లేక సమన్లు జారీ చేస్తుందా? అన్నది తెలియాలంటే మరో 24 గంటలు ఆగాల్సిందే. కాగా మూడు అంశాల విచారణ కొనసాగుతోందని పవర్ కమిషన్ చీఫ్ జస్టిస్ ఎల్ నరసింహారెడ్డి నోటీసుల్లో పేర్కొన్నారు. ఛత్తీస్‌గఢ్, భద్రాద్రి, యాదాద్రి థర్మల్ ఎలాంట్లపై విచారణ కొనసాగుతోందని అన్నారు. టెండర్ల పక్రియ లేకుండా ఒప్పందాలు జరిగాయని, 25 మందికి నోటీసులు ఇచ్చామని నరసింహారెడ్డి పేర్కొన్నారు. కాగా మాజీ సీఎం కేసీఆర్ మాత్రం ఇంకా సమాధానం ఇవ్వలేదని, సమయం కావాలని కోరారని వివరించారు. మాజీ సీఎండీ, ప్రస్తుత సీఎండీలతో సమావేశం అయ్యామని తెలిపారు. సోమవారం మాజీ సీఎండీ ప్రభాకర్ రావు, నాటి ప్రిన్సిపల్ సెక్రెటరీ సురేష్ చందాతో సమావేశం అయ్యామని నరసింహా రావు వివరించారు. మూడు నిర్ణయాలు అప్పటి ప్రభుత్వం మాత్రమే తీసుకుందని పవర్ కమిషన్ చీఫ్ జస్టిస్ ఎల్ నరసింహా రెడ్డి పేర్కొన్నారు. జెన్‌కోకు ఎలాంటి సంబంధం లేదని చెప్పారు. ఎస్కే జోషి, అరవింద్ కుమార్‌లతో మంగళ వారం సమావేశం అయ్యామని చెప్పారు. అరవింద్ కుమార్ అప్పుడే రేగ్యులేటరీ కమిషన్‌కు లేఖ రాశారని, అయితే పట్టించుకోలేదని అన్నారు. రెండు రాష్ట్రాల మధ్య ఒప్పందం జరిగినప్పుడు కేంద్రానికి అధికారం ఇవ్వాలని, అయితే రెండు రాష్ట్రాల ఒప్పందంతో ఛత్తీస్‌ఘడ్‌కు అధికారం ఇచ్చారని పేర్కొన్నారు. భారీగా నిధులు ఖర్చు చేసి పవర్ కొనుగోలు చేశారని, మొత్తం పక్రియలో ఎంత నష్టం అనేది తేల్చాల్సి ఉందని నరసింహా రెడ్డి పేర్కొన్నారు. ఇక భద్రాద్రిలో సబ్ క్రిటికల్ టెక్నాలజీని పెట్టారని, అంతటా సూపర్ క్రిటికల్ టెక్నాలజీ పెట్టారని నరసింహా రెడ్డి వివరించారు. యాదాద్రిలో నామినేషన్ బేస్‌లో ఇచ్చారని, ఇంకా పూర్తి కాలేదని అన్నారు. ఆగస్టు వరకు ఒక లైన్ అందుబాటులోకి వస్తుందని అంటున్నారు కానీ రైల్వేలైన్ వెయ్య లేదని పేర్కొన్నారు. అధికారుల నుంచే కాకుండా ప్రముఖులు నుంచి కూడా సమాచారం తీసుకుంటున్నా మని అన్నారు.

## రేవంత్‌కు టాస్క్.. కేబినెట్ విస్తరణలో ఎవరికో చోటు?

హైదరాబాద్,లోక్‌సభ ఎన్నికల్లో తెలంగాణలో కాంగ్రెస్‌కు మెజారిటీ స్థానాలు అందించేందుకు తీవ్రంగా కష్టపడ్డ సీఎం రేవంత్ రెడ్డికి ఇప్పుడు మరో టాస్క్. ఆ ఎన్నికల్లో రాష్ట్రంలో కాంగ్రెస్‌కు 8 సీట్లు దక్కిన సంగతి తెలిసిందే. దీంతో డబుల్ డిజిట్ సీట్లను గెలుచుకోలేకపోయిన కాంగ్రెస్ రేవంత్‌పై కాస్త అసహనం వ్యక్తం చేసినట్లు సమాచారం. ఈ ఎన్నికల హడావుడి నుంచి బయటపడ్డ రేవంత్ ఇక ప్రభుత్వంపై, రాష్ట్రంలో పార్టీపై ఫోకస్ పెట్టారు. త్వరలోనే ఆయన కేబినెట్‌ను విస్తరించే అవకాశం ఉంది. ఈ సమాచారం తెలుసుకున్న పార్టీ ఎమ్మెల్యేలు తమ ప్రయ్నతాలను మొదలెట్టినట్లు టాక్. తెలంగాణ మంత్రివర్గంలో త్వరలోనే మార్పులు, చేర్పులు ఉండే అవకాశం ఉంది. దీని కోసం సీఎం రేవంత్ రెడ్డి ఇప్పటికే కసరత్తులు పూర్తి చేశారని తెలిసింది. మరోవైపు కేబినెట్ విస్తరణకు కాంగ్రెస్ హైకమాండ్ నుంచి కూడా గ్రీన్ సిగ్నల్ వచ్చినట్లు సమాచారం. గతేడాది అసెంబ్లీ ఎన్నికల్లో విజయం తర్వాత ఏర్పడ్డ కాంగ్రెస్ ప్రభుత్వంలో రేవంత్‌తో సహా 12 మందితో మంత్రివర్గం ఏర్పడింది. ఇప్పుడు ఖాళీగా ఉన్న ఆరు స్థానాలను భర్తీ చేయనున్నట్లు తెలిసింది. లోక్‌సభ ఎన్నికల్లో కష్టపడి పార్టీ కోసం పని చేసిన వాళ్లకు మంత్రివర్గ కూర్పులో ప్రాధాన్యం ఉంటుందని కాంగ్రెస్ అధిష్ఠానం కూడా స్పష్టం చేసిన సంగతి తెలిసిందే. ఆగస్టు 15 లోపు పూర్తిస్థాయి కేబినెట్‌ను సిద్ధం చేసుకోవాలని రేవంత్ రెడ్డి భావిస్తున్నట్లు తెలిసింది. అయితే మంత్రి పదవిపై చాలా మంది నేతలే ఆశ పెట్టుకున్నారు. ఇప్పటికే పదవి కోసం ఆశావహులు తమ ప్రయత్నాలనూ మొదలెట్టారు. ఈ నేపథ్యంలో పదవి



ఎవరికివ్వాలన్నది రేవంత్‌కు పెద్ద టాస్క్‌గా మారిందనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. ప్రస్తుతం రెడ్డి సామాజిక వర్గం నుంచి నలుగురు, ఎస్సీ, బీసీ సామాజిక వర్గాల నుంచి ఇద్దరు, ఎస్టీ, కమ్మ, వెలమ సామాజిక వర్గాల నుంచి ఒక్కొక్కరు చొప్పున కేబినెట్‌లో ఉన్నారు. కొత్తగా మైనారిటీలకు అవకాశం కల్పించాలని రేవంత్ చూస్తున్నట్లు తెలిసింది. ఒకరిని ఎమ్మెల్సీగా చేసి మంత్రి పదవి ఇచ్చే ఆస్కారముంది. ఇక ముదిరాజ్ వర్గం నుంచి కూడా ఒకరికి కేబినెట్‌లో చోటు దక్కే ఛాన్స్ ఉంది. మరోవైపు ఇతర పార్టీల నుంచి వచ్చిన వాళ్లకు కాకుండా కాంగ్రెస్‌లోనే కొనసాగుతున్న వాళ్లకు మంత్రి పదవులు ఇవ్వాలన్నది హైకమాండ్ ఆలోచనగా తెలుస్తోంది.


## పాలనపై దృష్టి సారించిన చంద్రబాబు



అమరావతి,జూన్ 14: రాష్ట్రంలో తెలుగుదేశం పార్టీ నేతృత్వంలోని ఎన్డీఏ కూటమి ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయడంతో ఇక పాలనను పట్టాలకు ఎక్కించేందుకు కసరత్తు చేస్తున్నారు. తొలిదశలో ఇచ్చిన హామీల మేరకు సిఎం నారా చంద్రబాబు నాయుడు పలు పథకాలకు సంతకాలు చేశారు. నాలుగోసారి ముఖ్యమంత్రిగా చంద్రబాబు బాధ్యతలు స్వీకరించగా, మంత్రివర్గాన్ని కూడా ఏర్పాటు చేశారు. ఈ క్రమంలోనే పలు కీలక నిర్ణయాలు తీసుకునే దిశగా ప్రభుత్వం ముందడుగు వేస్తోంది. ఈ నెల 18న మంత్రివర్గ సమావేశాన్ని ఏర్పాటు చేయనున్నట్లు తెలుస్తోంది. ఈ కేబినెట్ భేటీలో పలు కీలక నిర్ణయాలు తీసుకునే అవకాశం ఉందని తెలుస్తోంది. ముఖ్యంగా ఎన్నికల్లో ఇచ్చిన హామీల అమలకు సంబంధించి మంత్రివర్గ సమావేశంలో చర్చించే అవకాశం ఉంది. అలాగే ఈ నెల 19న అసెంబ్లీ సమావేశాలు నిర్వహించేందుకు కూడా ప్రభుత్వం సన్నాహాలు చేస్తోంది. ఇప్పటికే మంత్రులుగా పలువురు బాధ్యతలు స్వీకరించారు. వీరికి శుక్రవారం శాఖలను కేటాయించే అవకాశం ఉందని చెబుతున్నారు. ఇప్పటివరకు వస్తున్న సమాచారం ప్రకారం జనసేన అధినేత పవన్ కళ్యాణ్ కు డిప్యూటీ సీఎంతోపాటు గ్రామీణాభివృద్ధి శాఖ బాధ్యతలు అప్పజెప్తారని చెబుతున్నారు. అలాగే నారా లోకేష్‌కు గతంలో మాదిరిగానే ఐటీతోపాటు అర్బన్ మంత్రిత్వ శాఖను కట్టబెట్టే అవకాశం ఉంది. మిగిలిన మంత్రులకు వారి సామర్థ్యాన్ని బట్టి శాఖలను చంద్రబాబు నాయుడు అప్పగిస్తారని చెబుతున్నారు. గురువారం సాయంత్రం నాటికి శాఖల కేటాయింపు పక్రియ పూర్తయ్యే అవకాశం ఉందని అనుకున్నారు. కానీ శాఖలను ప్రకటించలేదు. తెలుగుదేశం నేతృత్వంలోని కోటను రాష్ట్రంలో ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసిన నేపథ్యంలో కొన్ని కీలక మార్పులు దశగా అడుగులు వేస్తున్నట్లు తెలుస్తోంది. ఈ క్రమంలోనే వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం అమలు చేసిన పలు పథకాల పేర్లను మాచనన్నట్లు తెలుస్తోంది. పింఛన్ పథకానికి ఎన్టీఆర్ భరోసాగా పేరు మార్పు చేస్తూ శుక్రవారం ఆదేశాలు జారీ అయ్యాయి. వీటితోపాటు మిగిలిన పథకాలకు పేర్లు మార్చే అవకాశం ఉంది. గత ప్రభుత్వం అమలు చేసిన సంక్షేమ పథకాలకు నాటి సీఎం జగన్, దివంగత వైయస్ రాజశేఖర్ రెడ్డి పేర్లు ఎక్కువగా ఉన్నాయి. వీటి పేర్లను మార్చి ఎన్టీఆర్ తోపాటు ఇతర ముఖ్యమైన నాయకుల పేర్లు పెట్టే అవకాశం ఉంది. పింఛన్ పథకానికి వైఎస్సార్ పేరును తొలగిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. అదే సమయంలో పెన్షన్ మొత్తాన్ని పెంచుతూ ఆదేశాలు కూడా జారీ అయ్యాయి. ఇప్పటికే పెన్షన్ పెంచుతూ సీఎం చంద్రబాబు నాయుడు సంతకాన్ని కూడా చేశారు. ఈ నేపథ్యంలోనే అధికారులు ఉత్తర్వులు జారీ చేశారు. ప్రస్తుతం రూ.3 వేలు ఉన్న పెన్షన్ రూ.4 వేలకు పెంచుతున్నారు. వృద్ధులు, వితంతువులు, ఒంటరి మహిళలు, నేతన్నలు, మత్స్యకారులు, కల్లు గీత కార్మికులు, డప్పు కళాకారులు, ఊఎ÷ఎ బాధితులు, హిజ్రాలకు ఇప్పటివరకు 3000 పెన్షన్ ఇస్తుండగా ఇకపై నాలుగు వేలు చెల్లించనున్నారు. దివ్యాంగులకు ప్రస్తుతం మూడు వేలు ఇస్తుండగా, ఇకపై ఆరు వేలు ఇవ్వనున్నారు. కుష్టు వ్యాధితో వైకల్యం సంభవించినవారికి ఆరువేలు చెల్లించనున్నారు. కిడ్నీ, కాలేయం, గుండె మార్పిడి చేసుకున్న వారికి, డయాలసిస్ స్టేజీకి ముందున్న కిడ్నీ వ్యాధిగ్రస్థులకు పదివేలు చెల్లించనున్నారు. మంచానికి పరిమితమైన వారికి రూ.15 వేలు వచ్చే నెల నుంచి అందించనున్నారు. ఎన్టీఆర్ హెల్త్ వర్సిటీగా మరోమారు పేరును మార్చనున్నారు.

## కాళేశ్వరం ప్రాజెక్ట్... కేసీఆర్,హరీష్ లకు కమిషన్ బిగ్ షాక్?

హైదరాబాద్,ప్రస్తుతం తెలంగాణలో బీఆరెస్స్ పెద్దలకు ఫుల్ బ్యాడ్ టైం నడుస్తున్నట్లుందని అంటున్నారు. అసెంబ్లీ ఎన్నికల్లో ఓటమి, అనంతరం లోక్ సభ ఎన్నికలో ఘోర ఫలితాలు, మరోపక్క పలువురు బీఆరెస్స్ ఎమ్మెల్యేలు కాంగ్రెస్ గూటికి చేరబోతున్నారనే కథనాలు, ఇంకోపక్క ఫోన్ ట్యాపింగ్ వ్యవహారం, ఈడీ చేతికి గొర్రెల పంపిణీ పథకం... ఇవి చాలవన్నట్లు తాజాగా కాళేశ్వరం ప్రాజెక్టుపై విచారణకు కమిషన్ సిద్ధమవుతుండటం!అవును... సుమారు 10ఏళ్లపాటు తెలంగాణ రాష్ట్రాన్ని పాలించిన బీఆరెస్స్ కు కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చాక వరుస కష్టాలు పలకరిస్తున్నయనే కామెంట్లు వినిపిస్తున్నాయి. ఇప్పటికే గొర్రెల పంపిణీ పథకంలో సుమారు రూ.700 కోట్ల మేర అవినీతి జరిగిందని.. ఈ విషయంపై కేసీఆర్ కు ఈడీ నోటీసులు సిద్ధం చేసిందని కథనాలొస్తున్న వేళ.. తాజాగా కాళేశ్వరం ప్రాజెక్ట్ వ్యవహారం తెరపైకి వచ్చింది.ఇందులో భాగంగా... కాళేశ్వరం ప్రాజెక్టుపై విచారణకు జస్టిస్ చంద్రఘోష్ కమిషన్ సిద్ధమవుతోందని.. ఈ క్రమంలో త్వరలో మరోసారి ఆకస్మిక పర్యటనలు ఉండొచ్చని అంటున్నారు. ఈ నేపథ్యంలోనే మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్, మాజీ మంత్రి హరీష్ రావు లకు నోటీసులు ఇచ్చే అవకాశాలు పుష్కలంగా ఉన్నాయనే గుసగుసలు తెలంగాణ రాజకీయాల్లో మొదలయ్యాయి.కాళేశ్వరం ప్రాజెక్టు వచ్చిన ఆరోపణలపై జస్టిస్ చంద్రఘోష్ కమిషన్ విచారణ వేగవంతంగా కొనసాగుతుందని తెలుస్తుంది. ఇందులో భాగంగా గురువారం నాడు హైడ్రాలజీ, నిపుణుల కమిటీ ఇంజినీర్లను విచారించిన కమిషన్... నేడు మరికొందరిని పిలిచి విచారిస్తుందని తెలుస్తుంది. ఈ క్రమంలో హైడ్రాలజీ నిపుణుల కమిటీ, ఇంజినీరింగ్ కమిటీలను... రెండు వారాల్లో మధ్యంతర నివేదిక,



వీలైనంత త్వరగా పూర్తిస్థాయి నివేదికను అందించాలని కోరినట్లు తెలుస్తుంది!ఈ క్రమంలో ముందుగా టెక్నికల్ అంశాలు, అనంతరం ఆర్థిక అంశాలపై కమిషన్ దృష్టి సారించనుందని తెలుస్తుంది. ఇందులో భాగంగానే ఆనకట్ట నిర్మాణ అంచనాలు, అప్పులు, వడ్డీ రేట్లు మొదలైన అంశాలపై విచారన చేయనుందని అంటున్నారు. విచారణలో భాగంగా ఇప్పటికే ఎల్ & టీ, నవయుగ, ఆఫ్కాన్ కనస్ట్రక్షన్స్ కంపెనీ ప్రతినిధులు హాజరయ్యారు.అయితే కాళేశ్వరం ప్రాజెక్టుపై నివేదిక ఇచ్చేందుకు జూన్ 30 డెడ్ లైన్ కావడంతో నిర్మాణ కంపెనీలు, అధికారుల నుంచి అన్ని వివరాలను సేకరిస్తోందంట కమిషన్. ఈ క్రమంలోనే మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్, మాజీ నీటిపారుదల శాఖ మంత్రి హరీష్ లకు నోటీసులు ఇచ్చేందుకు గ్రౌండ్ వర్క్ ప్రిపేర్ చేస్తున్నట్లు తెలుస్తోంది!!

## మధిరలో రూ.2.50 లక్షల విలువైన గుట్కా పట్టివేత



మధిర :గుట్కా నిల్వలపై మధిర పోలీసులు ఉక్కు పాదం మోపారు. శుక్రవారం మధిర టౌన్ ఎస్ఐ సంధ్య ఆధ్వర్యంలో పట్టణంలోని వర్తక సంఘం అధ్యక్షులు వేముల తిరుపతిరావు గోడౌన్ పై దాడులు నిర్వహించి గోడౌన్ లో నిల్వ ఉన్న 2.50 లక్షల విలువచేసే గుట్కాలను స్వాధీనం చేసుకొని సంబంధిత వ్యక్తిపై కేసు నమోదు చేశారు. అంతేకాకుండా రాష్ట్ర ప్రభుత్వం గత నెల మే 25 నుండి రాష్ట్రంలో గుట్కాలను నిషేధిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. అయితే గుట్కా నిషేధంపై ఈనెల 13వ తేదీ వరకు ఎటువంటి చర్యలు తీసుకోవద్దని సుప్రీంకోర్టు ఆదేశాలు ఉండటంతో యువత ఆరోగ్యంపై చెడు ప్రభావం చూపే గుట్కా మసాలాపై చర్యలు తీసుకునేందుకు పోలీసులు వెనకంజు వేశారు.సుప్రీంకోర్టు ఆంక్షలు ముగిసిన మరుక్షణమే మధిర పోలీసులు రంగంలోకి దిగి గుట్కాలు అమ్ముతున్న డాన్ లపై చర్యలు తీసుకున్నారు. వ్యాపార వర్గాలకు ఆదర్శంగా ఉండాల్సిన వర్తక సంఘం అధ్యక్షులు వేముల తిరుపతిరావు ఇటువంటి అక్రమ వ్యాపారాలు చేసస్తూ పట్టు పట్టడం పట్టణంలో చర్చనీయాంశమైంది మారింది. గతంలో కూడా ఈ వ్యక్తిపై వైరాలో గుట్కాలు రవాణా చేస్తూ పట్టుబడ్డారు. మరొకసారి గుట్కాలు అమ్ముతూ ఒక సారి మరోసారి బిల్లులు లేకుండా సరుకు రవాణా చేస్తూ టాస్క్ ఫోర్స్ పోలీసులకు పట్టుబడ్డారు.

## పోలీసులకు చిక్కిన ఆన్‌లైన్ వ్యభిచార ముఠా

హైదరాబాద్,జూన్ 14: హైటెక్ వ్యభిచార ముఠాను పోలీసులు పట్టుకున్నారు. నిందితుడు ఆన్‌లైన్ ప్లాట్‌ఫారమ్‌ల ద్వారా ముందుగా కస్టమర్‌లను సంప్రదించడం జరుగుతుంది. అనంతరం కస్టమర్‌ల డేటా బేస్‌ను తయారుచేసి.. వారు కోరుకున్న ప్రదేశంలో మహిళలు వారిని కలుసుకునేలా ఏర్పాటు చేస్తారు. కస్టమర్‌కు అనుకూలంగా ఉన్న లాడ్జ్‌ను బుక్ చేస్తారు. ఓ మహిళ కస్టమర్‌లతో లావాదేవీలు జరుపుతున్నట్టు పోలీసులు గుర్తించారు. అనేక మారు పేర్లతో సదరు మహిళ కస్టమర్లను ఆకర్షిస్తోందని తెలుసుకున్నారు. విశ్వసనీయ సమాచారం మేరకు పంజాగుట్ట పీఎస్ పరిధిలోని పార్క్ హోటల్‌లోని ఓ గదిపై దాడి చేసి బాధితురాలితోపాటు నిందితుడు కీర్తితేజను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. బాధితులు నివాసముంటున్న వివిధ ప్రదేశాలపై దాడి చేసి, పైన పేర్కొన్న ప్రధాన నిర్వాహకులు.. సబ్–ఆర్గనైజర్లను అరెస్టు చేశారు. వారి నుంచి రూ. 89,500 నగదు, రెండు కార్లు, రెండు బైక్స్, 18 సెల్‌ఫోన్లు, రెండు ల్యాప్‌టాప్‌లు, వివిధ బ్యాంకుల డెబిట్/క్రెడిట్ కార్డ్‌లను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు.

## ఢిల్లీలో జగన్ అనుసరించే వ్యూహం ఇదే!?

అమరావతి,ఏపీలో ఎన్నికల ఫలితాల అనంతరం భారీ ఓటమి చవి చూసిన వైసీపీ నేతలు ఇప్పుడిప్పుడే కోరుకుంటున్నారని అంటున్నారు. ఈ క్రమంలో ఎన్నికల ఫలితాలపై తీవ్ర విషాదంగా స్పందించిన జగన్ సైతం తేరుకుని.. వరుస సమీక్షని నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా ఇప్పటికే ఎమ్మెల్యేలు, మాజీ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలతో జగన్ వరుసగా భేటీలు నిర్వహించారు.ఈ సమయంలో లోక్ సభ, రాజ్యసభ ఎంపీలతో జగన్ భేటీ కానున్నారు. ఈ సందర్భంగా పార్లమెంట్ లో అనుసరించాల్సిన వ్యూహాలపై చర్చించనున్నారని తెలుస్తుంది. వాస్తవానికి ఏపీ అసెంబ్లీలో వైసీపీకి బలం లేకపోయినప్పటికీ... శాసనమండలిలో భారీ మెజారిటీ ఉన్న సంగతి తెలిసిందే. ఆ అవకాశాన్ని కచ్చితంగా సద్వినియోగం చేసుకోవాలని జగన్ భావిస్తున్నారు. ఇదే సమయంలో ప్రలోభాలకు లొంగొద్దని సూచిస్తున్నారు.అదేవిధంగా రాజ్యసభలో టీడీపీకి ఒక్క ఎంపీకూడా లేని పరిస్థితి. వైసీపీ మాత్రం 11 ఎంపీలతో బలమైన పార్టీగా రాజ్యసభలో ఉంది. మరోపక్క లోక్ సభ లోనూ 4గురు ఎంపీలను ఆ పార్టీ కలిగి ఉంది. మొత్తంగా పార్లమెంట్ ఉభయ సభల్లోనూ వైసీపీ 15 మంది ఎంపీలను కలిగి ఉంది. కాగా.. టీడీపీ లోక్ సభలో మాత్రమే 16 మంది ఎంపీల మెజారిటీ కలిగి ఉన్న సంగతి తెలిసిందే.ఈ నేపథ్యంలో ఇప్పటికే ఈ బలంపై ఆ పార్టీ కీలక నేత విజయసాయి రెడ్డి క్లారిటీ ఇచ్చారు. విధానాల వారిగా కేంద్రంలో బీజేపీకి తమ మద్దతు ఉంటుందని అన్నారు. ఈ క్రమంలో కేంద్రంలో నెంబర్ గేం చాలా కీలకంగా మారిన నేపథ్యంలో... బీజేపీతో ఉన్నంతలో సఖ్యతగానే ముందుకు పోవాలని జగన్ భావిస్తున్నారని అంటున్నారు. 2019–24 మధ్యకాలంలో బీజేపీకి మద్దతుగా నిలిచిన విషయాన్ని



గుర్తుచేస్తున్నారని తెలుస్తుంది!ఆ సమయంలో వారితో ఉన్న అనుబంధం మేరకు.. బీజేపీ నాయకత్వంపై జగన్ కు పూర్తి అవగాహన ఉందని అంటున్నారు. పైగా జగన్ పై మోడీకి పాజిటివ్ అభిప్రాయం ఉందని.. ఈ నేపథ్యంలో కేంద్రంలో బీజేపీతో సమయానుకూలంగా వ్యవహరించాలని జగన్ భావిస్తున్నారని అంటున్నారు. ఇదే విషయాన్ని తన పార్టీ లోక్ సభ, రాజ్యసభ ఎంపీలతో జగన్ చర్చించనున్నారని సమాచారం!దీంతో... ఏపీలో టీడీపీ బలంగా ఉన్నప్పటికీ, ఎన్డీయే కూటమిలో కీలకంగా ఉన్నప్పటికీ.. వైసీపీకి బీజేపీతో వచ్చే నష్టం కానీ, ఇబ్బందులు కానీ ఉండకపోవచ్చని అంటున్నారు పరిశీలకులు. మరి జగన్ వ్యూహాలు ఇంకెలా ఉండబోతున్నాయి.. జగన్ విషయంలో మోడీ ఆలోచనలు ఎలా ఉండనున్నాయనేది వేచి చూడాలి!

## సంపాదకీయం

శనివారం 15-06-2024

# యూరప్ దారి ఎటు?

యూరోప్ యూనియన్ ఎ యురోపియన్ యూనియన్ (ఈయూ) అనేది జాతీయవాదానికి అతీతమైన కూటమి. 27 యూరప్ దేశాలు అందులో సభ్యులుగా ఉన్నాయి. ఈ 27 దేశాలకు చెందిన ప్రజలు ఈయూ పార్లమెంటు సభ్యులను నేరుగా ఎన్నుకుంటారు. ఐదేండ్లకోసారి జరిగే ఈ ఎన్నికల పోలింగ్ 3-9 తేదీల్లో జరిగింది. ప్రత్యక్ష ప్రజామోద ముద్ర కారణంగా ఈయూను ప్రభుత్వాలకు అతీతమైన సూపర్ ప్రభుత్వంగా కనిపిస్తోంది. ఆ యా సభ్యదేశాల సార్వభౌమత్వం ఈ యూకు లోబడి ఉంటుంది. భద్రత, వాణిజ్య తదితర కీలక రంగాలకు సంబంధించిన విధానాలు ఈయూ పరిధిలోనే ఉంటాయి. తన సార్వభౌమత్వంపై ఈ తరహా ఆధిపత్యం ఏ మాత్రం అంగీకరించని బ్రిటన్ ఈయూ నుంచి వైదొలగిన సంగతి తెలిసిందే. ఉక్రెయిన్ యుద్ధం, గాజా నుంచి కాందిశీకుల వెల్లువ, వాతావరణంలో మార్పుల సంక్షోభం నేపథ్యంలో ఈయూ ఎన్నికల ఫలితాలపై సహజంగానే ఆసక్తి కనబరిచింది. ఈ నేపథ్యంలో ఈయూ ఎన్నికల్లో జాతి ఆధిపత్య వాదుల ప్రాబల్యం పెరిగినట్టు వస్తున్న వార్తలపై ఆందోళన వ్యక్తమవుతోంది. ఇదంతా దేనికి సంకేతమనే విశ్లేషణలు జోరుగా జరుగుతున్నాయి. మరోవైపు పర్యావరణ పరిరక్షణకు పాటుపడే గ్రీన్స్ పార్టీ, సామాజిక న్యాయం కోసం పోరాడే వామపక్ష పార్టీల బలం ఈయూలో క్రమంగా తగ్గుతోంది. ఉదారవాదులను ఈ పరిణామాలు కలవరపాటుకు గురిచేస్తున్నాయి. యూరప్ ఓటర్లు తమ జాతీయపార్టీల అభ్యర్థుల నుంచి ఈయూ ఎంపీలను ఎన్నుకుంటారు. అలా ఎన్నికైన సభ్యులు భావజాలాన్ని బట్టి ఈయూ స్థాయిలో కూటములు కడతారు. ఇటలీ, ఫిన్లాండ్ హంగరీల్లో ఈ సరికే జాతి ఆధిపత్యవాద పార్టీలు అధికారంలో ఉన్నాయి. ఇప్పుడు ఈయూ ఎన్నికల్లో అదే ప్రతిఫలిస్తున్నది. జర్మనీ, ఫ్రాన్స్, ఆస్ట్రియా దేశాల్లో పాలక పక్షాలకు ఎదురుదెబ్బ తగిలింది. ఫ్రాన్స్‌లో పాలక రినైజాన్స్ పార్టీ జాతి ఆధిపత్యమైన నేషనల్ ర్యాలీ పార్టీ చేతుల్లో చిత్తు కావడం ప్రకంపనలకు దారితీసింది. దీంతో అధ్యక్షుడు ఇమ్మాన్యుయేల్ మాక్రా న్ పార్లమెంటును రద్దుచేసి ఎన్నికలకు ఆదేశించడం చిన్న విషయం కాదు. జాతి ఆధిపత్యవాదం ఫలితంగా యూ ర్యాప్ రెండు ప్రపంచయుద్ధాలను చూసింది. అపారమైన ధన, ప్రాణ నష్టాలకు గురైంది. యూరప్ ప్రజలకు ఈ మహమ్మారి అంటే సహజంగానే వ్యతిరేకత ఉంటుంది. అయినప్పటికీ దేశదేశాల్లో జాతి ఆధిపత్యవాదం పడగ విప్పుతూనే ఉంది. నయా ఫాసిస్టు మూకలు జర్మనీ వంటి దేశాల్లో తూర్పు నుంచి వలస వచ్చిన ప్రజలపై దాడులు చేయడం గురించిన వార్తలు తరచూ వెల్లువడుతూనే ఉన్నా యి. ఇది జర్మనీకి మాత్రమే పరిమితమైన విషయం కాదు. ప్రపంచవ్యాప్తంగా ఇస్లామిక్ తీవ్రవాదం పెచ్చరిల్లిన తర్వాత యూరప్‌లో జాతిపరమైన వివక్షలు పెరిగిపో యాయి. వలస విముక్త దేశాల నుం చి వచ్చిన ప్రజలను అనుమానంగా చూడ టం పెరిగిపోయింది. ఈ పరిస్థితులు ఆ యా దేశాల్లో ఉద్రిక్తతలు పెరగడానికి దారితీశా యి. ఈ నేపథ్యంలో ఆసియా నుంచి బతుకుదెరువు కోసం యూరప్ దేశాల్లో స్థిరపడిన భారతీయులు, ఇతర మాజీ వలస దేశాలవారికి ఈయూలో జాతి ఆధిపత్యవాదుల పట్టు పెరుగుతుండటం సహజంగానే ఆందోళన కలిగిస్తోంది. అయితే జాతి ఆధిపత్యవాదుల బ లం పెరిగినప్పటికీ అదింకా నిర్ణాయక స్థాయికి చేరుకోకపోవడం కొంత ఉపశమనం కలిగించే విషయం.

# ఆదాయం పెరగాలంటే...కిలోబియ్యం పోవాల్సిందే!

హైదరాబాద్,తెలుగు రాష్ట్రాల్లో ప్రభుత్వం అందచేస్తున్న కిలో రూపాయి బియ్యం పథకం గుదిబండగా మారింది. ఆదాయ మార్గాలపై అధ్యయనం చేస్తున్న ప్రభుత్వ పెద్దలు ఈ గుదిబండ పథకాన్ని మాత్రం కదిలించడం లేదు. కొత్తగా రేషన్ కార్డులు ఇసతామంటున్న పాలకులు ముందుగా పేదరికంలో ఉన్న కుటుంబాలను గుర్తించాలి. వారికి మాత్రమే రేషన్ కార్డులు ఇవ్వాలి. కేవలం బియయం కార్డులు మాత్రమే ఇవ్వాలి. ఎపిలో అధికారం చేపట్టిన సిఎం చంద్రబాబు ప్రక్షాళన ఈ దిశగా మొదలు పెడితే మంచిది. ఇబ్బడిముబ్బడిగా పెన్షన్లు, రేషన్ కార్డులు, కిలో రూపాయి బియ్యం పథకాలను సమీక్షించకుంటే గుదిబండగా మారి, ప్రజల ఆదాయాన్ని కొల్లగొడుతాయి. పేదలకు పట్టెడన్నం పెట్టాలన్న సంకల్పంతో దివంగత ముఖ్యమంత్రి ఎన్టీఆరామారావు కిలో రెండు రూపాయల బియ్యం పథకాన్ని ప్రవేశ పెట్టారు. దాదాపు 41 ఏళ్ల కిందటి మాట. కానీ ఇప్పుడు అదే బియ్యం ధర 40 నుంచి 50కిచేరింది. కానీ ఉభయ తెలుగు రాష్ట్రాల్లో కిలో రూపాయకే బియ్యం ఇస్తున్నారు. ఈ బియ్యాన్ని అమ్ముకోవడం, వ్యాపారంచేసుకోవడం అన్నది జరుగు తోంది. చాలామంది హోటళ్లకు అమ్ముకుంటున్నారు. కేంద్ర ప్రభుత్వం దీనిపై దాదాపు 20రూపాయలకు పైగానే సబ్సిడీ ఇస్తోంది. ఇలా ఖర్చుతో కూడుకున్న పథకం అమలు చేయడం ఎంతవరకు న్యాయం. ప్రజల డబ్బును ఇలా అధికారికంగా దుర్వినయోగం చేయడం సరికాదు. ఖచ్చితంగా సమీక్షించాల్సిన పథకాల్లో కిలో రూపాయి బియ్యం పథకం ముందు వరసలో ఉంటుంది. చంద్రబాబు మాత్రమే దీనిని తొలుత సమీక్షించి నిర్ణయం తీసుకోగలరు. కొత్తిమీర పది, ఉల్లిగడ్డలు 50కి చేరిన తరుణంలో ఇంకా కిలో రూఆయికే బియ్యం ఇస్తామంటే కుదరదు. ఇది ప్రజలను వంచించడం తప్ప మరోటి కాదు. గతంలో ఇదే పథకాన్ని సమీక్షించి కిలో 5 రూపాయలు చేసిన ఘనత చంద్రబాబుది. ఉమ్మడి ఎపిలో ఆయన దీనిని సమీక్షించి, ప్రజాభిప్రాయంతో 5 రూపాయలకు కిలో బియ్యం చేశారు. కానీ కిరణ్ కుమార్ రెడ్డి సిఎం అయ్యాక దీనిని కిలో రూపాయి బియ్యంగా మార్చి దివాళా పథకంగా చేశారు. ప్రజల డబ్బును దుబారా చేస్తున్న ఈ పథకం విధానాన్ని విధిగా సమీక్షించాలి. పక్కదారి పడుతున్న పథకంపై కన్నేయాల్సిందే. నిరుపేదలకు ఉచిత పథకాలపై సమీక్షించ కుంటే తెలుగు రాష్ట్రాల్లో ఆర్థికమాంద్యం కూడా తీవ్ర ప్రభావం చూపగలదు. ప్రజలు చెమటోడ్చి పన్నుల రూపంలో కట్టిన డబ్బులు వృధా పథకాలతో దుబారా చేస్తున్న పథకాలకు చరమగీతం పలకాలి. ప్రజల డబ్బులకు జవాబుదారీగా ఉండాల్సిన పాలకులు తమకు అనుగుణంగా, ఓటు బ్యాంక్ రాజకీయాల కోసం పథకాలను కొనసాగించడం సరికాదు. నిరుపేదల కడుపు నింపడానికి పంపిణీ చేయాల్సిన రాయితీ బియ్యం యథేచ్ఛగా నల్ల బజారుకు తరలి అక్రమార్కుల పరం అవుతోంది. సిబ్బంది కొరత, కొరవడిన తనిఖీలకు ప్రజల అమాయకత్వం జత కలవడంతో ప్రజా పంపిణీ వ్యవస్థ గాడి తప్పింది. బియ్యం అక్రమ రవాణా చేయడం నిత్యకృత్యంగా మారినా అరికట్టాల్సిన అధికారులు చేష్టలుడిగి ప్రేక్షక పాత్రకు పరిమితమవుతున్నారు. రేషన్ దుకాణాల సమయపాలనకు తిలోదకాలు ఇవ్వడం,నిత్యావసర సరకులు వచ్చినా రాలేదని గద్దించడం, కార్డులను డీలర్లు తమ వద్దే ఉంచుకొని బియ్యాన్ని స్వాహా చేస్తూ రాష్ట్రాలను దాటిస్తూ సొమ్ము చేసుకుంటున్నారు. అమాయక ప్రజలు చేసేది లేక ఆవేదన చెందుతున్నారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ లో ఆనాటి ముఖ్యంత్రి ఎన్టీఆర్ బడుగు బలహీన వర్గాలకు బియ్యం అందచేయాలన్న లక్ష్యంతో కిలో రెండు రూపాయల బియ్యం పథకాన్ని



అమలు చేశారు. ఆనాడది సంచలన నిర్ణయంగా నిలిచింది. ఆ తరవాత చంద్రబాబు సిఎం అయ్యాక దానిని ఐదు రూపాయలకు పెంచారు. దీంతో కొంత దుబారా తగ్గిందనే చెప్పాలి. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిక మళ్లీ కిలో రెండు రూపాయలకు చేశారు. ఇలా చేయడం వల్ల కేవలం ఓటు బ్యాంక్ రాజకీయాలు దాగి ఉన్నాయి. దీనిని కిరణ్ కుమార్ రెడ్డి సర్కార్ కిలో రూపాయికే మార్చడం ద్వారా అక్రమాలకు తెరలేపారు. కిలో రూపాయికి బియ్యం ఇవ్వడం వల్ల ఏదో ఘనకార్యం చేశామని గొప్పగా ప్రకటించుకున్నారు. రూపాయికి కొత్తిమీర కూడా లభించని ఈ రోజుల్లో ఇంకా ఈ పథకాన్నికొనసాగించడం ఆర్థిక భారం తప్ప మరోటి కాదు. ఆర్థిక మందగమనం నేపథ్యంలో అనేక పథకాలను సమీక్షించాల్సి ఉంది. బియ్యం పథకంపై ఆజమాయిషీ లేకపోవడం వల్ల చౌక బియ్యాన్ని తినడానికి బదులు అమ్ముకోవడానకే ఎక్కువగా ఉపయోగిస్తున్నారు. ఇది కొందరికి వనరుగా, మరికొందరికి ఆదాయ వనరుగా మారింది. ఈ బియ్యంతో హోటళ్లలో టిఫిన్లు తయారవు తున్నాయి. అలాగే సరిహద్దులు దాటి సన్నబియ్యంగా మారుతున్నాయి. పాలకుల దూరాలోచన లేని కారణంగా ఈ బియ్యం కేవలం వ్యాపార దృక్పథంతో సాగుతున్నాయి. తెలంగాణ జిల్లాలకు మహారాష్ట్ర అతి సమీపంలో ఉండటం, అక్కడ బియ్యం ధర అధికంగా ఉండటంతో పేదల ఆకలి తీర్చాల్సిన రాయితీ బియ్యాన్ని అక్రమార్కులు సొమ్ము చేసుకుంటున్నారు. రైళ్లలో అక్రమ రవాణా జరుగుతున్నా, బియ్యాన్ని పోలీసులు పట్టుకోవడం నిత్యం జరుగుతున్నా అవకతవకలకు అడ్డుకట్ట పడడం లేదు. దీనిపై సమీక్షించి కఠినంగా వ్యవహరించడంతో పాటు కిలో రూపాయిని కనీసం ఐదు రూపాయలకు పెంచాల్సిన అవసరం ఉంది. ఈ మొత్తాన్ని రైతుల కు మద్దతు ధరలకు కేటాయిస్తే మరీ మంచిది. వేలకోట్లు దండగమారి పథకానికి ఖర్చు చేస్తున్నారు. వేలకోట్లు ఈ పథకం కోసం ఖర్చవుతున్నా మళ్లీ సమీక్ష చేయలేక పోతున్నారు. ఎక్కడ ఓట్లు పోతాయో అన్న అభయం వెన్నాడుతున్నట్లుగా ఉంది. రేషన్ కార్డులు తగ్గించడమంటే పేదవారికి బియ్యం దక్కకుండా అడ్డుకోవడం కాదు. రేషన్ బియ్యం తినే ప్రతిఒక్కరికీ బియ్యం అందిస్తాం అంటూ ప్రజలు కట్టే పన్నులకు పాతరేస్తున్నారు. చౌకధరలకు తీసుకుని బయట అమ్ముకునే వారిని గుర్తించి తొలగించడం లేదు. కార్డులు తగ్గించకున్నా అక్రమాలపై దృష్టి పెట్టడం లేదు. పేదలకు బియ్యం అందించాలన్న సదుద్దేశ్యాన్ని ఎవరూ కాదనలేరు. కానీ రూపాయికే ఇవ్వాలనుకోవడం, అలా ఇచ్చిన బియ్యం అక్రమంగా తరలకుండా కఠినంగా చర్య తీసుకోకపోవమే ఆక్షేపణీయం. అందుకే ఆదాయవనరులపై దృష్టి పెట్టేముందు. .దీనిని సమీక్షించి దుబారా అరికట్టగలిగితే ఆదాయం కిందనే చూడవచ్చు.

# ఎపిని నంబర్‌వన్‌గా తీర్చి దిద్దుతా

తిరుమల,టిటిడి నుంచే పాలనా ప్రక్షాళన చేస్తామని ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ప్రకటించారు. శ్రీవారి సమక్షంలో చెబుతున్నా.. నేను 5కోట్ల ప్రజల మనిషిని. పార్టీ నాయకులు, కార్యకర్తలు ఈ 5 ఏళ్ళు ఎంతో ఇబ్బంది పడ్డారు. రాష్ట్రంలో ఉద్యోగులతో పాటు అన్ని వర్గాల ప్రజలు ఇబ్బంది పడ్డారని అన్నారు. రాష్ట్రంలో ఇకపై పరదాలు, నియంత్రణ వుండదు. నేటి నుంచి ప్రజా పాలన ప్రారంభం అయ్యింది. గత 5ఏళ్లలో జరిగిన నష్టం అపారం. రాష్ట్రం 30 సంవత్సరాలు వెనక్కి వెళ్ళింది. 2047 నాటి భారత్ ప్రపంచంలోనే మొదటి రెండు స్థానాల్లోకి వస్తుంది. 2047 విజన్‌తో ముందుకు వెళ్తానిని ప్రకటించారు. ఏపీ దేశంలోనే నెంబర్ 1న రాష్ట్రంగా ఉండాలి. తెలంగాణ అభివృద్ధి చెందాలి. తెలుగు రాష్ట్రాలకు పెద్దగా రెంటికీ మంచి జరిగేలా చూస్తానని అన్నారు. గురువారం ఉదయం చంద్రబాబు కుటుంబ సమేతంగా తిరుమల శ్రీవారిని దర్శించుకున్నారు. శ్రీ వెంకటేశుని దర్శనం అనంతరం మీడియాతో మాట్లాడిన ఆయన.. శ్రీవారి ఆశీస్సుల కారణంగానే తమ కూటమి విజయం సాధించిందన్నారు. రాష్ట్ర ప్రజలు చారిత్రాత్మక తీర్పునిచ్చారని.. 93 శాతం స్ట్రైక్ రేట్ గతంలో ఎప్పుడూ రాలేదన్నారు. తన ప్రమాణ స్వీకారోత్సవానికి ప్రధాని నరేంద్ర మోదీతో పాటు.. కేంద్ర మంత్రులు, పలువురు ప్రముఖులు హాజరయ్యారన్నారు. తాను ఏ కార్యం చెయ్యాలన్నా ముందుగా తన కుల దైవమైన వెంకటేశ్వర స్వామి ఆశీస్సులు పొందుతానని చంద్రబాబు చెప్పుకొచ్చారు. 2003లో స్వామి వారికి వస్త్రాలు సమర్పించేందుకు వచ్చే సమయంలో నాపై క్లైమోర్ మైన్‌లతో దాడి చేశారు. ఆ దాడిని చూస్తే ఎవరు బ్రతకరు. కానీ శ్రీవారి ఆశీస్సులతో బయటపడ్డాను. దేవాన్ష్ పుట్టినరోజు నాడు శ్రీవారి అన్నదానానికి ప్రతి ఏటా విరాళం ఇస్తున్నాం. నేను ప్రతి రోజు గంటల తరబడి పూజలను చెయ్యను. ఒక్క నిమిషం మాత్రమే ధ్యానం చేస్తాను. శ్రీవారిని ఒక్కటే కోరుకుంటా. రాష్ట్ర ప్రజలు బాగుండాలి. దేశం అభివృద్ధి చెందాలి. సంపదను సృష్టించి పేద ప్రజలకు పంచే అవకాశం ఇవ్వాలని కోరుకుంటానని అన్నారు. హైదరాబాద్‌ని 1.0 విజన్‌తో అభివృద్ధి చేశాను. అప్పుడు చేసిన అభివృద్ధిని చూసి ప్రపంచంలోని దేశాధినేతలు హైదరాబాద్‌కి వచ్చారు. భారతదేశంలోని కుటుంబ వ్యవస్థ ప్రపంచానికే ఆదర్శం. నేను జైలులో ఉన్నప్పుడు నన్ను ఆదుకున్నది కుటుంబ వ్యవస్థనే. తిరువళ్ళ శనివారాల్లో ఉపవాసం వుండి స్వామి వారికీ పూజలు చేస్తాం. స్వామి వారి దర్శనానికి వచ్చే వాళ్ళు మళ్ళీ మళ్ళీ వచ్చి స్వామి వారిని దర్శించుకుంటుంటారు. మన రాష్ట్రం, దేశంలోనే కాకుండా ప్రపంచంలో కూడా శ్రీవారి ఆలయాలు నిర్మించే విధంగా ముందుకు వెళ్తాం.' అని చంద్రబాబు చెప్పారు. పేదరికంలేని సమాజాన్ని నిర్మించేందుకు ప్రయత్నిస్తా. ఆర్థిక అసమానతలు లేని విదంగా చర్యలు చేపడుతాం. టీటీడీతోనే ప్రక్షాళన ప్రారంభం అవ్వాలి. నా పర్యటనలోనూ పరదాలు కడుతున్నారు. టీటీడీలో పెద్ద ఎత్తున్న అవకతవకలు జరిగాయి. జనాలనూ నా దగ్గరకు రానివ్వకుండా కర్ఫ్యు వాతావరణం సృష్టించారు. నా కుటుంబానికి నేను ఏమి ఇవ్వాల్సిన అవసరం లేదు. 30 ఏళ్ల క్రితమే వాళ్ళకి వ్యాపారం పెట్టించా. ప్రజలు గెలవాలి.. రాష్ట్రం నిలబడాలని పిలుపునిచ్చా.. నా పిలుపు మేరకు ప్రజలు మాకు అధికారం ఇచ్చారు. దురదృష్టం వల్ల అమరావతి, పోలవరం పడకేసింది. ఈ రెండింటిని అభివృద్ధి చెయ్యాలి. తిరుమల ఒక పవిత్రమైన దివ్య క్షేత్రం. తిరుమలని అపవిత్రం చెయ్యడం భావ్యం కాదు. వైకుంఠం ద్వారా స్వామి వారిని దర్శించుకోవడం మంచి అనుభూతిని ఇస్తుంది. తిరుమలని ప్రక్షాళన చేస్తా. దేశం గర్వపడేలా ప్రక్షాళన జరుగుతుందన్నారు. తిరుమలని దరిద్రపు ప్రాంతంగా తయారు చేశారు. గత ఐదేళ్లలో తిరుమలలో వీరు చెయ్యని అరాచకం లేదు. తిరుమల కొండపై అపచారం చేసిన వాళ్ళు ఈ జన్మలోనే శిక్ష అనుభవిస్తారు. మంచిని ప్రోత్సహిస్తా.. రౌడీయిజాన్ని అణచి వేస్తా' అని సీఎం చంద్రబాబు నాయుడు అన్నారు. గతంలో తిరుమలలో అటవీ ప్రాంతాన్ని అభివృద్ధి చేయడంతో పాటు, ఔషధ మొక్కలను పెంచి అభివృద్ధి చేశామని అన్నారు. తిరుమలకు వస్తే ఆరోగ్యం పెరగాలి అన్నదే తన సంకల్పం అన్నారు.

# అస్తిత్వ సంక్షోభంలో 5 ప్రాంతీయ పార్టీలు...



హైదరాబాద్,2014, 2019 లోక్‌సభ ఎన్నికల్లో అప్రతిహతంగా అత్యధిక స్థానాలను సాధించుకుని ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయగలిగిన బిజెపి, ఈసారి తగిన స్థానాలను దక్కించుకోవడంలో వెనుకబడడమే గాక, విపక్షాల నుంచి గట్టి పోటీని ఎదుర్కోవలసి వచ్చింది. అందుకే పొత్తు కుదుర్చుకునే అవసరం ఇప్పటివరకు రాకపోయినప్పటికీ, తెలుగుదేశం, జనతాదళ్ యునైటెడ్ పొత్తుతో మూడోసారి ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయగలిగింది. దీంతో తెలుగుదేశం, జెడి(యు) పార్టీలకు ఎన్‌డిఎ ప్రభుత్వంలో భాగస్వామ్యం పొందే అవకాశం లభించింది. ఈ అవకాశం అన్నిప్రాంతీయ పార్టీలకు లభించలేదు. సార్వత్రిక ఎన్నికల్లో అనూహ్య పరిణామాలు తలెత్తడంతో ప్రస్తుతం బిజూ జనతా దళ్, బహుజన సమాజ్, జననాయక్ జనతా, టిఆర్ఎస్, అన్నాడిఎంకె ఈ ఐదు ప్రాంతీయ పార్టీల ఉనికి దెబ్బతింది. అస్తిత్వ సంక్షోభం దిశగా చూడవలసి వస్తోంది. పార్లమెంట్‌లో తమ గొంతు వినిపించే పోయింది. ఈ పార్టీలన్నీ ఒకప్పుడు ముఖ్యమంత్రులను, ఒకానొక సందర్భంలో పార్లమెంట్‌కు విశేష సంఖ్యలో ఎంపీలను పంపినవే. ఈసారి మాత్రం అస్తిత్వ సంక్షోభాన్ని అనుభవిస్తున్నాయి. 1997లో బిజూ జనతాదళ్ ఆవిర్భవించింది. అప్పటి నుంచి ఎలాంటి ఎదురీత లేని పార్టీ ఇప్పుడు పార్లమెంట్‌లో తన అన్నది లేకుండా పోయింది. మొట్టమొదటిసారి 2009 తరువాత అసెంబ్లీ ఎన్నికల్లో ఈ పార్టీ మెజార్టీ సాధించలేకపోయింది. గత 24 ఏళ్లుగా తిరుగులేని ముఖ్యమంత్రిగా నెగ్గుకుంటూ వస్తున్న నవీన్ పట్నాయక్ ఇప్పుడు పక్కకు తప్పుకోవలసి వచ్చింది. బిజెపి నుంచే ముఖ్యమంత్రి అవుతున్నారు. లోక్‌సభ ఎన్నికల్లో బిజూ జనతాదళ్ ఓట్ షేర్ 2019లో 43.32 శాతం ఉండగా, ఇప్పుడు 37.53 శాతం దిగజారిపోవడం శోచనీయం. 21 పార్లమెంట్ స్థానాలకు 2019లో 12 సాధించుకోగా, ఈసారి జీరో. అసెంబ్లీ ఎన్నికలను చూసే మొత్తం 147 స్థానాలకు కేవలం 51 స్థానాలను గెలుచుకోవడం. 5% పాయింట్లు దిగజారి 40.22% ఓట్లు మాత్రమే వచ్చాయి. పార్లమెంట్, అసెంబ్లీ ఎన్నికల్లోనూ చాలా అధ్వాన పరిస్థితి దాపురించింది. ప్రాంతీయ పార్టీల్లో ఒకప్పుడు మిగిలిన పార్టీలన్నిటినీ తుడిచిపెట్టేసిన బిజూ జనతాదళ్ పార్టీ ఇప్పుడు ఈ ఏడాది ఒక్క సీటు కూడా సాధించలేని స్థితికి దిగజారిపోయింది. పొరుగునున్న ఉత్తరప్రదేశ్‌లో మాయావతికి చెందిన బహుజన్ సమాజ్ పార్టీ (బిఎస్‌పి)ది కూడా ఇదే పరిస్థితి. ఒకప్పుడు దళితుల గొంతుగా గుర్తింపు పొందిన ఈ పార్టీ ఉత్తరప్రదేశ్‌లో తన పట్టును కోల్పోయినట్లుగా కనిపించింది. ఈసారి ఎన్నికల్లో ఖాతా తెరవలేక 10% పాయింట్ల ఓట్ల భాగస్వామ్యాన్ని 9.39 శాతం కోల్పోయింది. 2019లో ఈ పార్టీ 19.42% ఓట్ షేర్‌తో 10 పార్లమెంట్ స్థానాలను సాధించుకోగా, ఈసారి పోలింగ్‌కు ముందే ఎస్పీతో పొత్తు విషయంలో వివాదానికి దిగింది. హర్యానాలో ఉత్తర పక్కన నియోజక వర్గంలో జననాయక్ జనతా పార్టీ కూడా రాష్ట్రంలోని తనకున్న పది స్థానాలను కోల్పోయింది. మాజీ ఉప ప్రధాని దేవీలాల్ భావజాలంతో 2018లో ఈ పార్టీ ఏర్పాటైంది. 2019 లో హర్యానా శాసన సభ ఎన్నికల్లో 10 స్థానాలను గెలుచుకోగా, ఈ ఏడాది మార్చి వరకు రాష్ట్రాన్ని పాలించిన బిజెపి ప్రజాప్రతినిధిగా సంకీర్ణ ప్రభుత్వంలో భాగస్వామిగా ఉండేది. 2019 ఎన్నికల్లోనూ ఇప్పుడు కనీసం ఒక్క ఎంపీ సీటు కూడా గెలుచుకోలేకపోయింది. చాలా స్థానాల్లో అభ్యర్థులు డిపాజిట్లు కోల్పోయారు. ఈ పార్టీ ఓట్ల శాతం వాటా 4.9% నుంచి 0.87 శాతం పడిపోయింది. తెలంగాణలో తెలంగాణ రాష్ట్ర సమితి (టిఆర్ఎస్) కూడా పార్లమెంట్ స్థానాలను గెలుచుకోలేక పోయింది. 2014లో 11 ఎంపీ స్థానాలను గెలుచుకున్న ఈ పార్టీ 2019లో 9 స్థానాలనే గెలుచుకోగా, 2024లో జీరో స్థానాలు గెలుచుకున్నాయి. ఇంకా దక్షిణాదిలో తమిళనాడుకు సంబంధించి ఆల్ ఇండియా అన్నా ద్రవిడ మున్నేట్ర కజగం (ఎఐఎడిఎంకె)ను మొదట అగ్రనటుడు, అగ్ర రాజకీయ యోధుడు ఎంజిఆర్ స్థాపించగా, తరువాత నటి జయలలిత సారథ్యం వహించారు. మొట్టమొదటిసారి ఎన్‌డిఎతో పొత్తులేకుండా పోరు సాగించిన ఈ పార్టీ ఇప్పుడు తమిళనాడులో తాను పోటీకి నిలబడి మొత్తం 32 స్థానాలను కోల్పోయింది. ఎఐఎడిఎంకె మిత్ర పక్షాలైన దేశీయ ముర్పొక్కు ద్రవిడ కజగం (డిఎండికె), సోషల్ డెమొక్రాటిక్ పార్టీ ఆఫ్ ఇండియా (ఎస్‌డిపిఐ), పుదియ తమిజగం (పిటి) పార్టీలు కూడా రాష్ట్రంలోని మిగిలిన 7 ఎంపి స్థానాల్లో ఒక్కటీ దక్కించుకోలేకపోయాయి. 2014లో ఈఐఎడిఎంకె మొత్తం 39 ఎంపీ స్థానాల్లో 37 వరకు గుండుగుత్తగా దక్కించుకోగా, 2019 ఎన్నికల్లో పార్టీ స్థాయి బాగా కుదించుకుపోయి ఒకే ఒక్క స్థానానికి పరిమితమైంది. ఇప్పటి ఎన్నికల్లో ఆ ఒక్కటి కూడా మిగల లేదు.

## కాళేశ్వరం విచారణ కమిషన్ ముందుకు ఇంజనీర్లు

హైదరాబాద్,కాళేశ్వరం ప్రాజెక్టులో భాగమైన మేడిగడ్డ బ్యారేజీ ఏడో బ్లాక్ కుంగుబాటు, పియర్స్, గేట్లు దెబ్బతినడం, అన్నారం, సుందిళ్ల బ్యారేజీలలో సీపేజీలు సహా పలు సమస్యలపై విచారణ కొనసాగుతోంది. విచారణలో భాగంగా జస్టిస్ పీసీ ఘోష్ న్యాయ విచారణ కమిషన్ను హైడ్రాలజీ, నిపుణుల కమిటీ ఇంజినీర్లు కలిశారు. ఈ మేరకు రెండు వారాల లోపు మధ్యంతర నివేదిక, సాధ్యమైనంత త్వరగా పూర్తిస్థాయి నివేదికను అందించాలని రెండు కమిటీల ఇంజినీర్లను కమిషన్ ఆదేశించింది. టెక్నికల్ అంశాలకు సంబంధించిన విషయంలో అఫిడవిట్ ÷ల్ చేయాలని నిపుణుల కమిటీలకు ఆయన సూచించారు. జూన్ 14న మరి కొంతమంది అధికారులు, ఇతర వ్యక్తులు విచారణకు హాజరు కావాలని కమిషన్ చీఫ్ పీసీ ఘోష్ ఆదేశించారు. త్వరలోనే ఆయన మరోసారి సడన్ ఫీల్డ్ విజిట్ చేయనున్నట్లు తెలుస్తోంది. కాళేశ్వరం కమిషన్ బహిరంగ విచారణకు సిద్ధమవుతోంది. ఈ మేరకు అఫిడవిట్ దాఖలు చేసిన ప్రతి ఒక్కరినీ బహిరంగ విచారణలో భాగస్వామ్యం చేయనున్నారు. విజిలెన్స్ రిపోర్టు ఇవ్వాలంటూ కమిషన్ ప్రభుత్వాన్ని గతంలో ఆదేశించినప్పటికీ ఇంతవరకూ రిపోర్టు కమిషన్‌కు అందలేదు. దీంతో విజిలెన్స్ రిపోర్టు కోసం మరోసారి ప్రభుత్వం, విజిలెన్స్ శాఖకి లేఖ రాయనున్నట్లు తెలుస్తోంది.

# విమానయాన రంగాన్ని ఆధునీకరిస్తాం

న్యూఢిల్లీ,కింజారపు రామ్మోహన్ నాయుడు కేంద్ర మంత్రిగా బాధ్యతలు స్వీకరించారు. ఢిల్లీలోని తన కార్యాలయంలో మధ్యాహ్నం 1:10 గంటల సమయంలో కేంద్ర పౌర విమానా శాఖ మంత్రిగా బాధ్యతలు తీసుకున్నారు. దేశంలో అత్యంత పిన్న వయసులో కేంద్ర కేబినెట్ మంత్రి పదవి రామ్మోహన్ చేపట్టారు. ఈ సందర్భంగా మీడియాతో మాట్లాడిన ఆయన.. శ్రీకాకుళం ప్రజలకు ఎల్లప్పుడూ రుణపడి ఉంటానన్నారు. సీఎం చంద్రబాబు తనకు కేంద్ర మంత్రిగా అవకాశం ఇచ్చారన్నారు. తనపై నమ్మకంతో ప్రధాని నరేంద్ర మోదీ.. పౌర విమానయాన శాఖ అప్పగించారన్నారు. వంద రోజుల యాక్షన్ ప్లాన్ తయారు చేయాలని అన్ని శాఖలను మోదీ కోరారని మంత్రి చెప్పుకొచ్చారు. 'కేంద్రమంత్రిగా బాధ్యతలు చేపట్టడం చాలా ఆనందంగా ఉంది. భగవంతుడు, మా నాన్న ఎర్రన్న నాయుడు ఆశీస్సులు నాకు ఉన్నాయి. బాధ్యత రావడానికి కారణమైన చంద్రబాబు, లోకేష్, పవన్ కళ్యాణ్, శ్రీకాకుళం తెలుగు ప్రజలకు ధన్యవాదాలు. పౌర విమానయాన శాఖ కేటాయించిన మోదీకి కృతజ్ఞతలు. దేశంలో, ప్రపంచంలో అత్యధికంగా అభివృద్ధి సాధిస్తున్న రంగం విమానయాన రంగం. యువతకు బాధ్యత ఇస్తే సమర్థవంతంగా నిర్వహిస్తారని మోదీ నాకు ఈ బాధ్యత అప్పగించారు. నా శాఖను సమర్థవంతంగా నిర్వహిస్తాను. 100 రోజుల ప్రణాళిక తయారు చేస్తాం. 2047 నాటికి సివిల్ ఏవియేషన్‌లో ఏ కార్యక్రమాలు చేపట్టాలో ప్రణాళికలు రూపొందిస్తాం అని వివరించారు. అలాగే సామాన్య ప్రయాణికుల కోసం ఈస్ ఆఫ్ ఫ్లయింగ్‌పై దృష్టి పెడతాం. పర్యావరణ హితంగా మంత్రిత్వ శాఖను నిర్వహిస్తాం. భవిష్యత్తులో 100 శాతం పర్యావరణ హితంగా మంత్రిత్వ శాఖ కార్యక్రమాలు నిర్వహిస్తాం' అని రామ్మోహన్ చెప్పారు. 'ఎయిర్ పోర్టుల నిర్మాణం వేగవంతం చేస్తాం. సామాన్యులకు విమానయాన రంగాన్ని చేరువ చేస్తాం. విమానయాన రంగానికి పునాదులు వేసిన వ్యక్తి అశోక్ గజపతి రాజు. ఉడాన్ స్కిమ్ ద్వారా సామాన్యులకు విమాన ప్రయాణం చేరువైంది. జ్యోతిరాదిత్య సింధియా సూచనలు తీసుకున్నాను. డీజీ యాత్రను విమానాశ్రయా లకు విస్తరిస్తాం. సివిల్ ఏవియేషన్ ఆఫ్ ఇండియా బెస్ట్‌గా తీర్చిదిద్దుతాం అన్నారు. మోదీ, చంద్రబాబు విజనరీ లీడర్స్. వారిద్దరి లిడర్ షిప్‌లో పౌర విమానయాన శాఖను ముందుకు తీసుకువెళతాను. భోగాపురం ఎయిర్ పోర్టును రికార్డు సమయంలో పూర్తి చేసి విమానాలు ల్యాండ్ చేస్తాం. విజయవాడ, తిరుపతికి కనెక్టివిటీ పెంచుతాం. రాజమండ్రి, కడప, కర్నూలు విమానాశ్రయాలు అభివృద్ధి చేస్తానని వివరించారు. ఏవియేషన్ రంగంలో స్కిల్ డెవలప్మెంట్‌ను ఏపీ నుంచి ప్రారంభిస్తాను. ఏపీ, తెలంగాణ సహా రాష్ట్రాల వారిగా విమానాశ్రయాల అభివృద్ధిని వేగవంతం చేస్తాం. విజయవాడ టెర్మినల్ నిర్మాణం పూర్తి చేస్తాం. విజయవాడ ఎయిర్ పోర్టు కనెక్టివిటీ పెంచుతాం' అని కేంద్ర మంత్రి రామ్మోహన్ వెల్లడించారు.

# మోదీ 3.0: రాష్ట్రాలకు గౌరవం దక్కేనా?

## మెగా డీఎస్సీ...ల్యాండ్ టైటిలింగ్‌పై మలి సంతకం

అమరావతి,ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు గురువారం బాధ్యతలు స్వీకరించారు. సాయంత్రం 4.41 గంటలకు సచివాలయం మొదటిబ్లాక్‌లోని తన ఛాంబర్‌లో వేదపండితుల మంత్రోచ్ఛారణల మధ్య ప్రత్యేక పూజలు చేసి బాధ్యతలు చేపట్టారు. రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి నీరబ్ కుమార్ ప్రసాద్, రాష్ట్ర మంత్రులు అచ్చెన్నాయుడు, కొల్లు రవీంద్ర, నిమ్మల రామానాయుడు, పయ్యావుల కేశవ్ తదితరులు కార్యక్రమంలో పాల్గొన్నారు. సీఎం హోదాలో సచివాలయానికి వచ్చిన చంద్రబాబుకు వివిధశాఖల ఉన్నతాధికారులు, ఉద్యోగ సంఘాల నేతలు ఘన స్వాగతం పలికారు. ఎన్నికల సందర్భంగా ఇచ్చిన హామీ మేరకు.. 16,347 టీచర్ పోస్టుల భర్తీకి సంబంధించి మెగా డీఎస్సీ దస్త్రంపై సీఎం మొదటి సంతకం చేశారు. ఏపీ ల్యాండ్ టైటిలింగ్ యాక్టు రద్దు ఫైల్‌పై రెండో సంతకం, సామాజిక పింఛన్ల రూ.4వేలకు పెంపు దస్త్రంపై మూడో సంతకం, అన్నా క్యాంటీన్ల పునరుద్ధరణపై నాలుగు, నైపుణ్య గణనపై ఐదో సంతకం చేశారు. ఈ సందర్భంగా ఉద్యోగులు సిఎం చంద్రబాబుకు అభినందనలు తెలిపారు. ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టేందుకు సచివాలయానికి వెళ్తున్న సీఎం చంద్రబాబుకు అమరావతి రైతులు అడుగడుగునా బ్రహ్మరథం పట్టారు. దారి పొడవునా పూలు చల్లి మహిళలు హారతులు పట్టారు. సీడ్ యాక్సెస్ రోడ్డు ప్రారంభంలో భారీ పూలదండలతో ఆయనకు స్వాగతం పలికారు. వారిని చూసిన చంద్రబాబు తన కాన్వాయ్ నుంచి దిగి రైతులకు అభివాదం చేశారు. వారితో ఆప్యాయంగా మాట్లాడారు. సీఎం చంద్రబాబు ప్రయాణించే రోడ్డుమార్గం మొత్తం అమరావతి రైతులు పూలతో నింపేశారు. సీడ్ యాక్సెస్, మందడం, వెలగపూడి రోడ్డు మీదుగా సచివాలయం వరకు రకరకాల పూలతో రహదారులు నిండిపోయాయి. ఐదేళ్ల తర్వాత అమరావతి అభివృద్ధికి అడుగులు పడనుండడంతో చిన్న, పెద్ద, కులం, మతం తేడా లేకుండా స్వాగతం పలికారు. పెద్దసంఖ్యలో మహిళలు పాల్గొనడంతో మందడంలో భారీ జన సందోహం నెలకొంది. పెద్దఎత్తున బాణసంచా కాలుస్తూ చంద్రబాబుకు ఘనస్వాగతం పలికారు. అంతకుముందు చంద్రబాబు విజయవాడ కనకదుర్గమ్మను దర్శించుకున్నారు. కుటుంబ సమేతంగా ఇంద్రకీలాద్రికి చేరుకొని అమ్మవారికి మొక్కులు చెల్లించుకున్నారు. తిరుమల పర్యటన ముగించుకొని ఇంద్రకీలాద్రికి చేరుకున్న సీఎంకు దేవాదాయ శాఖ కమిషనర్, ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్, ఆలయ ఈవో ఘన స్వాగతం పలికారు. దర్శనానంతరం ఆలయ అధికారులు తీర్థ ప్రసాదాలు అందజేశారు.

## ఐదేళ్ల అరాచకాలపై సైలెంట్

అమరావతి,ఓటమిని అంగీకరించని వైకాపా నేతలు సాకులు వెతికే పనిలో శవరాజకీయాలు చేస్తున్నారని టీడీపీ ఎమ్మెల్సీ పంచుమర్తి అనురాధ అన్నారు. అధికారం చేపట్టి రెండు రోజులు కాకముందే అప్పుడే అరాచకాలు అంటూ గగ్గోలు పెడుతున్నారని మండిపడ్డారు. ఐదేళ్లపాటు వైసీపీ నేతలు చేసిన అరాచకాలు, దౌర్జన్యాలు, మారణకాండకు తగిన మూల్యం చెల్లించుకున్నారని ఎమ్మెల్సీ పంచుమర్తి అనురాధ అన్నారు. ప్రతిపక్ష హోదా కూడా లేకుండా ప్రజలు చిత్తుచిత్తుగా ఎందుకు ఓడించారో ఆత్మ పరిశీలన చేసుకోవాలని హితవుపలికారు. అలా చేయకుండా ఓటమిపాలైన మరుసటి రోజు నుంచే శవ రాజకీయాలు మొదలుపెట్టారంటూ మండిపడ్డారు. రాష్ట్రంలో శాంతిభద్రతలు సరిగా లేవంటూ వైసీపీ నేతలు రాష్ట్రపతిని కలవటం సిగ్గుచేటని దుయ్యబట్టారు. వైసీపీ అంటేనే శవ రాజకీయాల పార్టీ అని వ్యంగ్యాస్త్రాలు సంధించారు. సీఎం పదవి కోసం తండ్రి శవం పక్కన పెట్టుకుని సంతకాలు సేకరించింది, 2019లో బాబాయి శవాన్ని అడ్డుపెట్టుకుని రాజకీయం చేసింది జగన్ రెడ్డి కాదా? అని ఆమె ప్రశ్నించారు. 'వైసీపీ ప్రభుత్వంలో పల్నాడులో తోట చంద్రయ్య గొంతు కోసి చంపారు. కంచర్ల జల్లయ్య యాదవ్‌ను హత్య చేశారు. దాచేపల్లిలో కాపు సామాజికవర్గానికి చెందిన పురంశెట్టి అంకులిని కిరాతకంగా హతమార్చారు. రేపల్లెలో బీసీ బాలుడు అమర్నాథ్ గౌడ్‌ను పెట్రోల్ పోసి తగలబెట్టారు. జడ్ ప్లస్ కేటగిరీ ఉన్న చంద్రబాబు నాయుడు ఇంటిపై జోగి రమేశ్ దాడి చేశారు. మా పార్టీ కార్యాలయంపై దాడి చేసి సిబ్బందిని విచక్షణ రహితంగా కొట్టి గాయపరిచారు. దళిత డ్రైవర్‌ని వైసీపీ ఎమ్మెల్సీ చంపి డోర్ డెలివరీ చేశారు. కరోనా సమయంలో మాస్కు అడిగిన పాపానికి దళిత డాక్టర్ సుధాకర్‌ను వేధించి మరీ చంపారు. ఇసుక మాఫియాను ప్రశ్నించిన చేనేత వర్గానికి చెందిన నందం సుబ్బయ్యను దారుణంగా హత్య చేశారు. ఎన్నికల రోజు తాడిపత్రి, చంద్రగిరి, మాచర్లలో దాడులు చేశారు' అని ఆమె చెప్పుకొచ్చారు. దాడులు, హత్యలు అంటే ఇవనీ.. అలాంటిది రాష్ట్రంలో శాంతిభద్రతలు సరిగా లేవంటూ వైసీపీ నేతలు రాష్ట్రపతిని కలవటంపై ఆమె మండిపడ్డారు. కూటమి ప్రభుత్వం ఏర్పడి రెండ్రోజులైనా కాకుండానే, తమ పార్టీ నేతలు దాడులు చేస్తున్నారని తప్పుడు ప్రచారం చేస్తే 'ఖబడ్దార్' అంటూ హెచ్చరించారు. వైసీపీ నేతలు ఇప్పటికైనా శవరాజకీయాలు మానుకోవాలని ఎమ్మెల్సీ అనురాధ హితవోపదేశం చేశారు.

## శకుని పాచికల్లా ఎన్నికల ఫలితాలు


విజయవాడ, ఎన్నికల ఫలితాలు శకుని పాచికల మాదిరి ఉన్నాయంటూ వైకాపా అధ్యక్షుడు జగన్ వివరించారు. ఈవీఎంలపై దేశవ్యాప్తంగా చర్చ జరగాలని జగన్ అభిప్రాయపడ్డారు. రాష్ట్రంలో బీజేపీ, టీడీపీ, జనసేన హనీమూన్ నడుస్తోందని.. వారికి మరికొంత సమయం ఇచ్చి..తర్వాత పోరాడదాం.. అంటూ ఎమ్మెల్సీలకు వివరించారు. శాసనసభలో అధికార పార్టీ నోరు కట్టడి చేసే అవకాశం ఉందని జగన్ అన్నారు. శాసనమండలిలో మాత్రం గట్టిగా ప్రభావం చూపాలని వైసీపీ ఎమ్మెల్సీలకు జగన్మోహన్ రెడ్డి దిశానిర్దేశం చేశారు.. ఎలాంటి ప్రలోభాలకు లొంగొద్దని.. కేసులు పెట్టినా భయపడొద్దు.. అంటూ సూచించారు. గురువారం తాడేపల్లి వైఎస్ జగన్ వైసీపీ ఎమ్మెల్సీలతో భేటీ అయ్యారు. ఈ సందర్భంగా జగన్ మాట్లాడుతూ.. ఎమ్మెల్సీలు ఎలాంటి ప్రలోభాలకు లొంగొద్దని.. కేసులు పెట్టినా భయపడొద్దు.. అంటూ ఎమ్మెల్సీలకు సూచించారు. 40 శాతం ప్రజలు మనవైపే ఉన్నారంటూ గుర్తుచేశారు. మనం చేసిన మంచి పనులు ప్రజలకు గుర్తున్నాయి.. అసెంబ్లీలో తమ నోరును కట్టడి చేసే అవకాశం ఉందని.. మండలిలో గట్టిగా పోరాడుదాం అంటూ జగన్ సూచించారు. ఇటీవల జరిగిన జనరల్ ఎలక్షన్‌లో ఘోర ఓటమిపాలైన వైసీపీకి, శాసనమండలిలో మాత్రం 39 మంది ఎమ్మెల్సీల బలం ఉంది. త్వరలో అసెంబ్లీ సమావేశాల నేపథ్యంలో క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్సీలతో జగన్ సమావేశమై పలు అంశాలపై చర్చించారు. శాసనమండలిలో అనుసరించాల్సిన వ్యూహంపై ఎమ్మెల్సీలకు దిశానిర్దేశం చేశారు. ప్రజలు ఆమోదించి వచ్చిన కూటమి ప్రభుత్వం ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్ రద్దుతోపాటు ఇతర కీలక బిల్లులను త్వరలో ప్రవేశపెట్టే అవకాశం ఉంది. గత ప్రభుత్వ హయాంలో ప్రవేశపెట్టిన మరికొన్ని బిల్లులను కూడా ఉపసంహరించే ఛాన్స్ ఉంది. ఈ క్రమంలో శాసనసభలో బలం లేకపోయినా.. మండలిలో ఉన్న బలంతో ఆయా బిల్లుల విషయంలో ప్రభుత్వ నిర్ణయాన్ని ప్రశ్నిస్తూ ప్రతిఘటించే అవకాశం ఉంది. అలాగే అధికార పార్టీ ప్రవేశపెట్టిన బిల్లులు ఆమోదం పొందాలంటే మండలిలో తగినంత

న్యూఢిల్లీ,మోదీ ప్రమాణ స్వీకార కార్యక్రమంలో జరిగిన ఓ ఘటన అందరినీ ఆశ్చర్యానికి గురిచేసింది. బీహార్ ముఖ్యమంత్రి నితీష్‌కుమార్ మోదీ వద్దకు రాగానే ఆయన లేచి నిలబడి కరచాలనం చేశారు. పక్కనే ఉన్న అమిత్ షా, నడ్డా కూర్చున్నప్పటికీ మోదీ మాత్రం గౌరవపూర్వకంగా లేచి కరచాలనం చేశారు. ఈ సన్నివేశాన్ని చూశాక నాకు సరిగ్గా పదేండ్ల కింద ఢిల్లీలో జరిగిన ఒక ఘటన గుర్తుకువచ్చింది. ఒక కార్యక్రమంలో ముఖ్యమంత్రులందరూ వరుసగా నిలబడగా.. తొలిసారి బాధ్యతలు చేపట్టిన నరేంద్ర మోదీ వారికి కరచాలనం చేస్తూ ముందుకు వెళ్తున్నారు. ఢిల్లీ ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్ కరచాలనం చేయి ముందుకుచాస్తే.. మోదీ ఆయనను పట్టించుకోకుండానే వెళ్లిపోయారు. అప్పట్లో ఆ ఘటన సంచలనంగా మారింది.ప్రధాని మోదీ ఎ దేశమంతా బీజేపీ విజయకేతనం ఎగురవేస్తే దేశ రాజధానిలో మాత్రం ఆప్ గెలవడం మోదీకి కంటగింపుగా ఉండటం సహజమే. కానీ, ప్రధానిగా ఆయన హుందాగా ఉండాలి. పార్టీలతో సంబంధం లేకుండా అందర్నీ గౌరవించాలి. మోదీ పదేండ్ల పాలనలో ఆ గౌరవ ప్రవర్తన చూస్తే భాగ్యం మనకు దక్కలేదు. మోదీ పగ ఏ స్థాయిలో ఉంటుందో కేజ్రీవాల్ జైలులో ఉండటాన్ని చూస్తేనే అర్థమవుతోంది. చివరికి ఏదో మాట తూలాడని రాహుల్‌గాంధీ పార్లమెం ట్ సభ్యత్వాన్ని కూడా రద్దు చేశారు. కానీ, ఇప్పుడు పరిస్థితులు మారాయి. సార్వత్రిక ఎన్నికల్లో బీజేపీకి సీట్లు తగ్గడంతో మిత్రపక్షాలకు ఆదరణ పెరిగింది. నితీష్ కుమార్‌కు ఎన్డీయే ద్వారా లు మూసుకుపోయాయని ప్రకటించిన మోదీనే ఆయన కనిపించగానే అప్రయత్నంగా లేచి నిలబడి స్వాగతం పలకడమే అందుకు నిదర్శనం.అలా అని మోదీ ఇక పూర్తిగా మారిపోయారు, ప్రజాస్వామ్యయుతంగా వ్యవహరిస్తున్నారని ఒక నిర్ణయానికి రాలేం. చంద్రబాబు, నితీష్‌ల మద్దతు వల్ల మోదీ మళ్లీ అధికారంలోకి వచ్చారు. అది మద్దతుకు లభించిన గౌరవమే తప్ప ప్రజాస్వామ్యంలో అందరినీ సమానంగా గౌరవించాలంటే హుందాతనం అని భావించలేం. రాష్ట్ర ప్రభుత్వాలను కూల్చివేయడం, ప్రత్యర్థి పార్టీల నాయకులపై సీబీఐ, ఈడీ దాడులు చేయడం, వారిని జైలుపాలు చేయడం వంటి మోదీ మార్క్ కక్ష సాధింపు రాజకీయాలకు బ్రేక్ పడుతుందని ఆశించవచ్చు.ఈ సందర్భంగా ఓషో చెప్పిన ఓ కథ గుర్తుకువస్తోంది. ఒక సంపన్నుడు మితిమీరిన కోపంతో భార్య తల నరికేస్తాడు. ఆ తర్వాత బాధ పడుతూ సన్యాసి వద్దకు వెళ్తాడు. తనకు సన్యాసం ఇప్పించాలని కోరుతాడు. 'నువ్వు సంపన్నుడివి, నీది విలాసవంతమైన జీవితం. ఖరీదైన దుస్తులు ధరిస్తావు. సన్యాసం నీ వల్ల కాదు' అని సన్యాసి చెప్తుండగానే ఆ సంపన్నుడు తన దుస్తులను ఫరాఫరా చింపేస్తాడు. ఇప్పుడు సన్యాసం ఇవ్వండని కోరతాడు. అందుకు సన్యాసి నవ్వి.. 'నీలో ఎలాంటి మార్పు రాలేదు. భార్య తల నరికినప్పుడు ఎలాగైతే ఆవేశంతో ఉన్నావో, ఇప్పుడు బట్టలు చింపుకొన్నప్పుడు కూడా అంతే ఆవేశంగా ఉన్నావు' అని చెప్పి పంపించేస్తాడు.ఇప్పుడు మోదీ విషయానికి వస్తే.. గతంలో ఒక సీఎంతో కరచాలనం చేయకుండా అవమానించడం, ఇప్పుడు ఒక సీఎం రాగానే లేచి నిలబడి కరచాలనం చేసిన తీరులోనూ సహజ లక్షణం లేదు. బీజేపీకి సొంతంగా బలం ఉన్నప్పుడు అన్నీ నడిచిపోయాయి. ఇప్పుడు ఆ పార్టీ 240 సీట్లకే పరిమితమైంది. నితీష్, చంద్రబాబుల మద్దతుతో ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయడం వల్ల గతంలో మాదిరిగా తన ఇష్టానుసారం వ్యవహరించడం కాదు. బీజేపీ సొంత బలంతో తిరిగి అధికారంలోకి వస్తే రాజ్యాంగం ఉండదు, రిజర్వేషన్లు ఉండవని చాలామంది భయాందోళనకు గురయ్యారు. 240 సీట్లకు పరిమితం కావడం వల్ల ఈ భయాలు ప్రస్తుతానికి తొలిగిపోయినట్టే.బీబీసీ చర్చలో విశ్లేషకుడు యోగేంద్ర యాదవ్ ఆసక్తికరమైన విషయాలను ప్రస్తావించారు. దక్షిణాదిలో దక్కిన సీట్ల వల్ల మోదీ ఈసారి అధికారంలోకి వచ్చారని చెప్తూనే.. దక్షిణాది కారణంగా అధికారంలోకి రావడం వల్ల మంచే జరిగింది. నియోజకవర్గాల పునర్విభజనతో దక్షిణాది సీట్లను తగ్గించి ఉత్తరాది సీట్లను పెంచాలనేది బీజేపీ వ్యూహం. ఇప్పుడు చివరికి దక్షిణాదియే బీజేపీని గట్టెక్కించడం వల్ల పార్లమెంటు నియోజకవర్గాల తగ్గింపు గండం దక్షిణాదికి తప్పినట్టయింది.సంకీర్ణ ప్రభుత్వమే అయినా మోదీ తన పంథాను మార్చుకోవడం లేదు. పేరుకు సంకీర్ణ ప్రభుత్వమే అయినప్పటికీ గతంలో బీజేపీకి సొంతంగా బలం ఉన్నప్పుడు ఎలాంటి నిర్ణయాలు తీసుకున్నారో అలాంటి నిర్ణయాలే ఆయన తీసుకున్నారు. సంకీర్ణ ప్రభుత్వంలో మంత్రివర్గంలో శాఖల కోసం మిత్రుల నుంచి తీవ్రంగా ఒత్తిడి ఉంటుంది. మంత్రివర్గం ఎలా ఉంటుందోనని స్టాక్‌మార్కెట్ అనేక సందేహాలతో కొట్టుమిట్టాడింది. గతంలో మాదిరిగానే మంత్రివర్గంలో శాఖలన్నీ బీజేపీనే తీసుకోవడంతో స్టాక్‌మార్కెట్ ఊపిరి తీసుకొని దూసుకెళ్తున్నది. చంద్రబాబు, నితీష్ కుమార్‌ల మద్దతు మోదీకి అనివార్యం. అదేవిధంగా వీరిద్దరికీ మోదీ మద్దతు అనివార్యం. పరస్పర అవసరాల వల్ల వీరి బంధం ఏర్పడింది. వీరికి ఒకరిపై ఒకరికి ఎంత అపనమ్మకం ఉన్నా అనివార్యంగా కలిసి ఉండాల్సిన పరిస్థితి. మోదీని వ్యతిరేకించి బాబు బయటకు వెళ్లి చేసేదేమీ లేదు. నితీష్ కుమార్ పరిస్థితి కూడా అంతే. మోదీతో సఖ్యతగా ఉండి తమకు కావలసినవి సాధించుకోవాలి తప్ప రాజకీయ ఎత్తుగడలతో సాధించేదేమీ ఉండదు. అలా భావించడం వల్లనే రెండు పార్టీలకు మోదీ ప్రభుత్వానికి మద్దతు ప్రకటించారు. ఈ రెండు పార్టీల మద్దతుతో కాంగ్రెస్ కూటమి అధికారంలోకి వచ్చి ఉంటే రాజకీయాలు వేరుగా ఉండేవి. వీరిద్దరు మద్దతు ఇచ్చినా ఇండి యా కూటమికి అధికారం దక్కదు. అందుకే అటు మోదీ ఇటు బాబు, నితీష్‌లు పరస్పర ప్రయోజనాలను దృష్టిలో పెట్టుకొని కలిసిపోయారు. పరిస్థితు లు వారిని కలిపాయి. ఈ బంధం వచ్చే ఎన్నికల



వరకు ఉండే అవకాశాలు ఎక్కువ.గతంలో ఒక సీఎంతో కరచాలనం చేయకుండా అవమానించడం, ఇప్పుడు ఒక సీఎం రాగానే లేచి నిలబడి కరచాలనం చేసిన తీరులోనూ సహజ లక్షణం లేదు. బీజేపీకి సొంతంగా బలం ఉన్నప్పుడు అన్నీ నడిచిపోయాయి. ఇప్పుడు ఆ పార్టీ 240 సీట్లకే పరిమితమైంది. నితీష్, చంద్రబాబుల మద్దతుతో ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయడం వల్ల గతంలో మాదిరిగా తన ఇష్టానుసారం వ్యవహరించడం కాదు.దేశంలోని ప్రధాన సర్వే సంస్థలు ఎన్డీయేకు 360 నుంచి 401 సీట్లు వస్తాయని ఎగ్జిట్‌పోల్స్‌లో చెప్పాయి. 'అబ్ కీ బార్ చార్ సౌ పార్' అని మోదీ నినాదం ఇస్తే.. ఆ నినాదానికి తగ్గట్టు సర్వే సంస్థలు ఎగ్జిట్‌పోల్స్‌ను ప్రకటించాయి. కానీ, వాస్తవ ఫలితాలు అందుకు భిన్నంగా వచ్చాయి. దేశంలో మెజారిటీ మీడియా బీజేపీ కనుసన్నల్లో ఉన్నది. ఎన్డీటీవీ లాంటి వాటిని సైతం బీజేపీ అనుకూల వ్యక్తులు కొన్నారు. 400 సీట్లు అని చెప్పడం ద్వారా మీడి యా తన విశ్వసనీయతను కోల్పోయింది. జూన్ 1న సాయంత్రం ఎగ్జిట్‌పోల్స్ వచ్చాయి. శని, ఆదివారం సెలవు. ఎగ్జిట్‌పోల్స్ ఫలితాల వల్ల సోమవారం స్టాక్‌మార్కెట్ రాకెట్‌లా దూసుకెళ్లింది. ఎగ్జిట్‌పోల్స్ వెనుక మీడియా యజమానుల స్వార్థం గురించి తెలియని ఇన్వెస్టర్లు అవి నిజమేనని అనుకొని మార్కెట్‌ను ఆకాశానికెత్తేశా రు. మరుసటిరోజు అసలు ఫలితాలు వచ్చాయి. ఎగ్జిట్‌పోల్స్‌కు, వాస్తవ ఫలితాలకు అసలు సంబంధం లేకపోవడంతో 4న ఒక్క రోజే స్టాక్‌మార్కెట్ ఇన్వెస్టర్ల రూ.30 లక్షల కోట్ల సంపద ఆవిరైపోయింది. ఎగ్జిట్‌పోల్స్ పేరుతో మార్కెట్‌ను ఇలా రాకెట్‌లా దూసుకువెళ్లేట్టు చేయడం వెనుక పెద్ద కుంభకోణం ఉందనేది రాహుల్‌గాంధీ చేస్తున్న ఆరోపణ. నిజానికి పోలింగ్ మొదలైనప్పటి నుంచి మార్కెట్ పడిపోతూ వచ్చింది. విదేశీ సంస్థాగత వెస్టర్లు మార్కెట్ నుంచి పెద్దమొత్తంలో పెట్టుబడులను వెనక్కి తీసుకున్నారు. ఫలితాలు బీజేపీకి అంత సానుకూలంగా ఉండవనే సంకేతాలు అందడంతోనే పెట్టుబడులు ఉపసంహరించుకుంటున్నాయనే వార్తలు మార్కెట్‌కు చేరాయి. కానీ, ఎగ్జిట్‌పోల్స్ నిజమేనని భావించిన ఇన్వెస్టర్లు భారీగా దెబ్బతిన్నాయి. ఈ కుంభకోణంపై జేపీసీ ఏర్పాటు చేసి విచారించాలని రాహుల్ గాంధీ డిమాండ్ చేశారు. నిజంగా కుంభకోణం జరిగిందా? జరిగినా నిరూపిస్తారా? జేపీసీ వేస్తారా? అంటే ఇందులో ఏ ఒక్కటి జరగదనే సమాధానమే వినిపిస్తుంది. కానీ, దేశ చరిత్రలో గతంలో ఎప్పుడూ లేనివిధంగా '4వ తేదీ నుంచి మార్కెట్ దూసుకెళ్తుంది, స్టాక్స్ కొనండి' అని దేశ ప్రధాని చెప్పడం విచిత్రం. ప్రధాని ఒక్కరే కాదు, హోం మంత్రి అమిత్ షా, ఆర్థికమంత్రి నిర్మలా సీతారామన్ కూడా ఈ విధంగానే స్వాతంత్ర్య భారతదేశంలో మొదటిసారిగా హామీ ఇస్తున్నారు. దేశం ఆర్థికంగా దూసుకువెళ్తుందని చెప్పడం, ఏయే రంగాల్లో అభివృద్ధి ఎలా సాగనున్నదో ప్రధాని బాధ్యత. అయితే, స్టాక్‌మార్కెట్ సలహాలు ఇవ్వడమంటే ప్రధాని తన స్థాయిని తగ్గించుకోవడమే.మ్యూచువల్ ఫండ్స్ అమ్మేటప్పుడు లాభం గ్యారంటీ అని బ్యాంకులు చెప్పడం ఆర్బీఐ నిబంధనలకు విరుద్ధం. అర్హత పరీక్షలు పాసైనవారు మాత్రమే స్టాక్స్‌కు సంబంధించి యూట్యూబ్‌లో సలహాలు అందిస్తున్నారు సెబీ నిబంధనలు ఉన్నాయి. కానీ, ప్రధాని మాత్రం ఏకంగా ఏయే స్టాక్స్ కొనాలో లోక్‌సభలోనే సగర్వంగా ప్రకటించారు. పీఎస్‌యూ స్టాక్స్ కొనమని, ఎల్‌ఐసీ స్టాక్ కొనమని మోదీ పార్లమెంటులో చెప్పారు. ఎల్‌ఐసీ 915 రూపాయలకు ఐపీవోకు వస్తే దాదాపు రెండేండ్ల పాటు 600–700 మధ్య తచ్చాడింది. వెయ్యి దాటగానే 'ఇప్పుడు చూడండి' అంటూ మోదీ ఆనందోత్సాహాలతో సగర్వంగా ప్రకటించారు. మోదీ తర్వాత ప్రకటించిన ఎల్‌ఐసీ మళ్లీ 900 రూపాయలకు దిగింది. ప్రధాని మాట నమ్మి కొన్నవారు నష్టపోయారు. 'హామీల అమలుకు నాదీ గ్యారంటీ' అని ప్రధాని చెప్తే గౌరవప్రదంగా ఉంటుంది. అంతేకాని స్టాక్‌మార్కెట్ సలహాలు స్థాయికి తగవు. ఈ నేపథ్యంలో దేశ ప్రధాని హుందాగా ఉంటారని, ప్రజాస్వామ్యయుతంగా వ్యవహరిస్తున్నారని, దేశ పాలన అంటే వ్యాపారం కాదని, భిన్నాభిప్రాయాలను వ్యక్తం చేసేవారు దేశ ద్రోహులు కాదని ఇప్పటికైనా గ్రహిస్తారని ఆశిద్దాం.పొరుగు రాష్ట్రమైన ఏపీ మద్దతుతో మోదీ అధికారాన్ని నిలుపుకోవడం వల్ల తమ డిమాండ్లను సాధించుకునే అవకాశం ఆ నిరూపణకు లభించింది. తెలంగాణలో బీజేపీ, కాంగ్రెస్‌లకు 8 సీట్లు రావడంతో జాతీయస్థాయిలో మనకు వాయిస్ లేకుండాపోయింది. గత పదేండ్లు తెలంగాణకు ఏమీ సాధించని బీజేపీ ఇప్పుడేదో సాధిస్తుందని అనుకోవడం అత్యాశే. తెలంగాణ ప్రాజెక్టులను గుజరాత్‌కు తరలించినా మౌనంగా ఉన్న వీరు ఇప్పుడు ఏదో సాధిస్తారని ఆశించలేం. మోదీపై ఇండియా కూటమి ఉద్యమించగలదేమో కానీ తెలంగాణకు ఏదో సాధించి పెడుతుందని అనుకోలేం. తాజా సార్వత్రిక ఎన్నికలు ఏపీకి అదృ ష్టమైతే మనకు మాత్రం దురదృష్టం.

## అధికారుల నిర్లక్ష్యం.. గ్రామ పంచాయతీ ఆఫీస్‌లో పాఠశాల




కుమ్రం భీం ఆసిఫాబాద్,కుమ్రం భీం ఆసిఫాబాద్ జిల్లా కేంద్రానికి 10 కిలోమీటర్ల దూరంలో ఉన్న వావుదం గిరిజన సంక్షేమ ప్రాథమిక పాఠశాల అరకొర వసతుల మధ్య గ్రామ పంచాయతీ భవనంలో కొనసాగుతోంది. ఐటీడీఏ నిర్వహిస్తున్న ఈ పాఠశాల మరో మూడు గిరిజన గ్రామాల అడవి బిడ్డలకూ విద్యనందిస్తున్నది. గతంలో పాఠశాల భవనం శిథిలావస్థకు చేరడం తో దానిని కూల్చివేసిన అధికారులు కొత్త భవనాన్ని నిర్మించారు. గత్యంతరం లేక ఈ పాఠశాలను గ్రామ పంచాయతీలోకి మార్చారు.గ్రామ కార్యకలాపాలు నిర్వహించే రోజున పంచాయతీ సెలవు ఇవ్వడమో లేక.. ఎక్కడైనా ఆరు బయట పాఠశాల నిర్వహించడం చేస్తున్నా రు. భవనం నిర్మించాలని గతంలో ధర్నా చేసిన అధికారులు స్పందించడం లేదని గిరిజనులు ఆవేదన వ్యక్తం చేశారు. కాగా కాప్రి, దెమ్మెడిగూడ, చి ంతగూడ గ్రామాల విద్యార్థులు సైతం ఈ పాఠశాలకే వచ్చి చదువుకుంటారు. నిరుడు 50 మంది చదువుకోగా.. ఈసారి మరో 20 మంది విద్యార్థులకు అవకాశం ఉందని ఉపాధ్యాయులు అంటున్నారు. పాఠశాల భవన నిర్మా ణానికి ఓ వ్యక్తి 30 గుంటలు దానం చే సినా, అధికారులు భవనాన్ని నిర్మించడంలో నిర్లక్ష్యం వహించడంపై స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

### బాధ్యతలు స్వీకరించిన మంత్రి పెమ్మసాని

న్యూఢిల్లీ,కేంద్ర గ్రామీణాభివృద్ధి, కమ్యూనికేషన్ శాఖల సహాయమంత్రిగా గుంటూరు ఎంపీ పెమ్మసాని చంద్రశేఖర్ గురువారం బాధ్యతలు స్వీకరించారు. తన కార్యాలయంలో బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా తనకు కేటాయించిన శాఖలను సమర్థవంతంగా నిర్వహిస్తానని అన్నారు. 'నాకు కేంద్ర సహాయ మంత్రి పదవి ఇచ్చినందుకు ప్రధాని మోదీ, చంద్రబాబులకు ధన్యవాదాలని పేర్కొన్నారు. పదవి నిర్వహణలో రాణిస్తానని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు. చంద్రబాబు, మోదీతో పాటు బీజేపీ నాయకత్వానికి కూడా ఆయన కృతజ్ఞతలు తెలియజేశారు. మార్గదర్శకత్వం కోసం ఇద్దరు డైనమిక్ వ్యక్తులైన శివరాజ్ సింగ్ చౌహాన్, జ్యోతిరాదిత్య సింథియాలను అప్పగించారని కొనియారు. ఇందుకు దేవుడికి కృతజ్ఞతలు తెలియజేస్తున్నానని అన్నారు

## కాశ్మీర్‌లో ఉగ్రదాడులపై కేంద్రం సీరియస్

న్యూఢిల్లీ, జమ్ముకశ్మీర్‌లో కొనసాగుతున్న ఉగ్రదాడిపై ప్రధాని నరేంద్ర మోదీ ఆరా తీశారు. అక్కడి భద్రతపై సమీక్ష జరిపారు. జాతీయ భద్రతా సలహాదారు అజిత్ దోవల్‌తో ప్రత్యేకంగా భేటీ అయ్యారు. ఉగ్రవాదులను ఎదుర్కొనేందుకు అవసరమైన సామర్థ్యాన్ని మరింతగా పెంచుకోవాలని అధికారులకు సూచించారు. గత నాలుగు రోజులుగా జమ్ముకశ్మీర్‌లో ఉగ్రదాడులు జరుగుతున్నాయి. భద్రతా బలగాలు, ఉగ్రవాదుల మధ్య కాల్పులు కొనసాగుతున్నాయి. ఇప్పటికే ఇద్దరు ముష్కరులను భద్రతా బలగాలు మట్టుబెట్టాయి. పాకిస్థాన్‌కి చెందిన ఉగ్రవాదులే ఈ దాడులకు తెగబడుతున్నట్టు ప్రాథమికంగా అంచనా వేస్తున్నారు. ఇప్పటికే కొందరి ఊహా చిత్రాలనూ విడుదల చేశారు. ఈ క్రమంలోనే మోదీ అక్కడి పరిస్థితులను సమీక్షించారు. ఈ భేటీలో అజిత్ దోవల్ మోదీ అక్కడి స్థితిగతులూ పూర్తి స్థాయిలో వివరించారు. సాయుధ బలగాలు ఈ దాడులను ఎదుర్కొనేందుకు ఎలాంటి చర్యలు చేపడుతుందో కూడా తెలిపారు. ఈ మేరకు మోదీ కొన్ని సూచనలు చేశారు. అవసరమైనతే భారీ మొత్తంలో సాయుధ బలగాలను మోహరించి ఉగ్రవాదుల్ని ఏరి వేయాలని ఆదేశించినట్టు విశ్వసనీయ వర్గాల ద్వారా తెలిసింది. దీనిపైనే మోదీ అమిత్ షాతో కూడా మాట్లాడారు. జమ్ముకశ్మీర్ లెఫ్టినెంట్ గవర్నర్ మనోజ్ సిన్హాతోనూ ప్రధాని మోదీ మాట్లాడారు. స్థానిక అధికార యంత్రాంగం ఉగ్రదాడులను అడ్డుకునేందుకు ఎలాంటి చర్యలు చేపడుతోందో అడిగి తెలుసుకున్నారు. దొడ జిల్లాలో మరోసారి ఎన్‌కౌంటర్ జరిగింది. ఈ ఘటనలో ఓ సైనికుడు గాయపడ్డాడు. దొడ జిల్లాలో ఇలా దాడి జరగడం రెండోసారి. నాలుగు రోజుల్లో నాలుగు సార్లు జమ్ముకశ్మీర్‌లో కాల్పుల మోత మోగింది. జూన్ 9వ తేదీన రేసీ జిల్లాలో ఓ బస్సుపై ఉగ్రవాదులు దాడి చేశారు. ఈ ఘటనలో 9 మంది ప్రయాణికులు ప్రాణాలు కోల్పోయారు. ఆ తరవాత భద్రతా బలగాలు ఉగ్రవేట మొదలు పెట్టాయి. కథువా జిల్లాలో సెర్చ్ ఆపరేషన్ నిర్వహించాయి. ఈ క్రమంలోనే ఎన్‌కౌంటర్ జరిగింది. దొడలో ఎత్తైన పర్వతాల్లో నలుగురు ఉగ్రవాదులు నక్కి ఉన్నారు. అక్కడి వరకూ వెళ్లి వాళ్లను మట్టుబెట్టడం సవాల్‌గా మారుతోంది. చత్తర్‌గల్లా వద్ద వాళ్ల కోసం గాలిస్తుండగా ఉన్నట్టుండి భద్రతా బలగాలపై కాల్పులు జరిపారు ఉగ్రవాదులు. ఈ ఘటనలో రాష్ట్రీయ రైఫిల్స్‌కి చెందిన ఐదుగురు సైనికులతో పాటు ఓ సీనియర్ పోలీస్ అధికారి గాయపడ్డారు.

## తెలంగాణలో పెద్దలందరికీ వైద్య పరీక్షలు

హైదరాబాద్,ఎన్నికల ప్రక్రియ ముగియడంతో ఇక పాలనపై సిఎం రేవంత్ దృష్టి సారించారు. ఇచ్చిన హామీల అమలు, కార్యక్రమాలపై దృష్టి పెడుతున్నారు. ఒక్కో కార్యక్రమాన్ని పట్టాలకు ఎక్కించడం ద్వారా తెలంగాణలో ఆదర్శ పాలనకు తెరతీసే ప్రయత్నంలో ఉన్నారు. గత పదేళ్లో విధ్వంసం అయిన రాష్ట్రాన్ని గాడిలో పెట్టే ప్రయత్నాలు చేపట్టారు. విద్య,వైద్య రంగాలను ఆదర్శంగా తీర్చిదిద్దే సంకల్పంతో కార్యాచరణకు సిద్ధం అవుతున్నారు. ఈ క్రమంలో తెలంగాణలో పెద్దలందరికీ వైద్య పరీక్షలు నిర్వహించేందుకు రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ సిద్ధం అవుతోంది. పెరుగుతున్న జీవనశైలి వ్యాధులను అరికట్టేలా పటిష్ట చర్యలు చేపట్టనున్నట్లు అధికారులు వెల్లడించారు. ప్రతి ఒక్కరికీ స్క్రీనింగ్ పరీక్షల నిర్వహణ కోసం 10 మొబైల్ ల్యాబ్స్ సిద్ధం చేసినట్లు చెప్పారు. జాతీయ ఆరోగ్య మిషన్ (ఎన్‌హెచ్‌ఎం)లో భాగంగా ఈ కార్యక్రమం చేపట్టనుండగా.. కేంద్రం నుంచి 60 శాతం నిధులు సమకూరనున్నాయి. రాష్ట్ర ప్రభుత్వం 40 శాతం నిధులు సమకూర్చనుంది. గ్రామీణ స్థాయి నుంచి ప్రజలకు ముందస్తు పరీక్షలు నిర్వహించడం ద్వారా సకాలంలో చికిత్స అందించే వీలుంటుందని అధికారులు పేర్కొంటున్నారు. అధ్యయనాల ప్రకారం తెలంగాణలో గత 20 ఏళ్లలో హృద్రోగాలు, క్యాన్సర్, మధుమేహం, బీపీ వంటి జీవనశైలి వ్యాధులు పెరుగుతున్నట్లు తేలింది. దాదాపు 60 శాతం వ్యాధులు ధూమపానం, మద్యపానం, జంక్ ఫుడ్స్ వల్లే వస్తున్నాయని అంచనా వేస్తున్నారు. అయితే, రొమ్ము క్యాన్సర్ వంటి తీవ్ర వ్యాధుల విషయంలో ఒక శాతంలోపే మహిళలు ముందస్తు పరీక్షలు చేయించు కుంటున్నారని లెక్కలు చెబుతున్నాయి. అమెరికా వంటి అభివృద్ధి చెందిన దేశాల్లో ఇది వంద శాతం వరకూ ఉంటోంది. ప్రజలందరికీ ముందస్తు పరీక్షలు నిర్వహించడం ద్వారా ఆయా వ్యాధులను నిర్ధారించి సకాలంలో వైద్య చికిత్సలు అందించడానికి వీలు కలుగుతుందని ఆరోగ్య శాఖ అధికారులు భావిస్తున్నారు. ఇదే లక్ష్యంతో ముందుకు సాగుతున్నామని అన్నారు. గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో వైద్య సిబ్బంది ఊరూరా తిరుగుతూ 26 – 70 ఏళ్ల వయసున్న అందరికీ డిజిటల్ మయోగ్రామ్, పాప్‌స్మెర్, ఈసీజీ, ఈ2డీ ఏకో సహా ఇతర అన్ని బ్లడ్ టెస్టులు నిర్వహిస్తారు. దీనికి అనుగుణంగా ఏర్పాటు చేసిన మొబైల్ ల్యాబ్స్‌లో వైద్యులతో పాటు నర్సులు, ఇతర టెక్నీషియన్లు అందుబాటులో ఉంటారు. ప్రధానంగా మహిళల్లో రొమ్ము, గర్భాశయ ముఖద్వార, నోటి క్యాన్సర్లు, మధుమేహం, అధిక రక్తపోటు, గుండె జబ్బులకు సంబంధించి స్క్రీనింగ్ పరీక్షలు నిర్వహిస్తారు. పురుషుల్లో నోటి క్యాన్సర్‌తో పాటు షుగర్, బీపీ, గుండె వ్యాధులపై పరీక్షలు నిర్వహించి అవసరాన్ని బట్టి హైదరాబాద్ ఎంఎన్‌జే ప్రభుత్వ క్యాన్సర్ ఆస్పత్రికి తరలిస్తారు. అక్కడ బయాప్సీ వంటి తదుపరి పరీక్షలతో వ్యాధి ఉందో లేదో నిర్ధారిస్తారు. ఒకవేళ షుగర్, బీపీ వంటి సమస్యలుంటే బాధితులకు ఉచితంగా మందులు అందిస్తారు. వారి వారి గ్రామాలకు సమీపంలోని ప్రభుత్వ ఆస్పత్రులకు వారిని అనుసంధానం చేసి అక్కడి నుంచి ప్రతి నెలా మెడిసిన్స్ తీసుకునేలా చర్యలు చేపట్టనున్నారు. ఒకవేళ బాధితులు ఎవరైనా ఆస్పత్రికి రాలేని స్థితిలో ఉంటే వారి ఇళ్ల వద్దకే ఆరోగ్య సిబ్బంది మందులు సరఫరా చేసేలా చూస్తారు.

## భార్యకు భరణం విషయంలో ధిక్కరణ

విజయవాడ, కమెడియన్ నటుడు పృథ్వీరాజ్ కు విజయవాడ ఫామిలీ కోర్టు షాకు ఇచ్చింది. 30 ఇయర్స్ ఇండస్ట్రీ ఫేమ్ నటుడు పృథ్వీరాజ్, తన భార్య శ్రీలక్ష్మికి ప్రతి నెలా భరణం చెల్లించాలని విజయవాడ ఫామిలీ కోర్టు గతంలో ఆదేశించింది. అయితే కోర్టు ఆదేశాలను పృథ్వీరాజ్ పక్కన పెట్టడమే కాకుండా, కోర్టుకు హాజరు కానందున, పృథ్వీరాజ్ అరెస్టుకు కోర్ట్ వారెంట్ జారీ చేసినట్టుగా తెలిసింది. ఇది నాన్ బెయిలబుల్ వారెంట్ అని కూడా తెలిసింది. విజయవాడకి చెందిన శ్రీలక్ష్మి నటుడు పృధ్వీరాజుని 1984లో వివాహం చేసుకుంది. వీరిద్దరికీ ఒక కుమారుడు, కుమార్తె వున్నారు. వీరి మధ్య మనస్పర్థలు రావటంతో పృథ్వీరాజ్ భార్యతో కాకుండా విడిగా వున్నాడు. శ్రీలక్ష్మి తన ఇద్దరి పిల్లలను తీసుకొని పుట్టింట్లో వున్నారు. 2017లో శ్రీలక్ష్మి కోర్టుకు వెళ్లి, న్యాయపరంగా తనకి తన భర్త పృథ్వీరాజ్ నెలకి రూ.8 లక్షల రూపాయలు భరణం చెల్లించాలని కోర్టువారిని కోరింది. అందుకు కోర్టు కూడా అంగీకరించింది, అలాగే శ్రీలక్ష్మి న్యాయపోరాటానికి అయ్యే ఖర్చులు కూడా పృథ్వీరాజ్ భరించాలని కోర్టు తీర్పు కూడా ఇచ్చింది. పృథ్వీరాజ్ సినిమాల్లోకి వెళ్ళాక తనని బాగా వేధించేవాడని, అందుకని తాను 2016 ఏప్రిల్ నెలలో తన పుట్టింటికి వచ్చేశానని అప్పట్లో

# మహా కూటముల్లో మంటలు.. అసమ్మతి గళం వినిపిస్తున్న పార్టీలు



ముంబై: లోక్‌సభ ఎన్నికల ముందు వరకు స్నేహగీతం పాడిన మహారాష్ట్ర పార్టీలు ఇప్పుడు అసమ్మతి గళం వినిపిస్తున్నాయి. అటు మహాయుతి(ఎన్డీయే)లో, ఇటు మహావికాస్ అఘాడీ(ఇండియా కూటమి)లో విభేదాలు మొదలయ్యాయి. కేంద్ర మంత్రి పదవుల కేటాయింపు మహాయుతిలో చిచ్చు పెట్టగా, ఎమ్మెల్సీ ఎన్నికల సీట్ల పంపకం మహావికాస్ అఘాడీలో మంటలు రాజేసింది. దీంతో నాలుగు నెలల్లో అసెంబ్లీ ఎన్నికలు జరగనున్న మహారాష్ట్ర రాజకీయాలు ఆసక్తికరంగా మారాయి.

మంత్రి పదవులపై అసంతృప్తి

మహారాష్ట్రలో ఆశించిన లోక్‌సభ స్థానాలు దక్కిన మహాయుతి కూటమిలో విభేదాలు మొదలయ్యాయి. ఓటమికి మీరంటే మీరే కారణమంటూ పరస్పరం నిందలు వేసుకుంటున్నారు. పోటీ చేసిన నాలుగు స్థానాల్లో మూడింట ఎన్సీపీ(అజిత్ పవార్)వర్గం ఓడిపోయింది. బీజేపీ సరిగ్గా పని చేయకపోవడమే ఇందుకు కారణమని అజిత్ పవార్. రాజ్యాంగాన్ని మారుస్తామని బీజేపీ నేతలు వ్యాఖ్యానించడం తమకు నష్టం చేసిందని బాహాటంగానే చెప్పారు. పైగా ఎన్సీపీకి కేంద్ర క్యాబినెట్‌లో చోటు దక్కలేదు. ఆ పార్టీ సీనియర్ నేత ప్రఫుల్ పటేల్‌కు సహాయ మంత్రి పదవి ఇస్తామని బీజేపీ చెప్పగా ఎన్సీపీ తిరస్కరించింది. మరోవైపు ఒక్క సహాయ మంత్రి పదవి ఇవ్వడం పట్ల ఒకే శివసేన(ఏక్‌నాథ్ షిండే) వర్గం బీజేపీపై అసంతృప్తి వ్యక్తం చేస్తోంది. బీజేపీ కంటే తామే మంచి ఫలితాలు సాధించామని, తాము 15 సీట్లలో పోటీ చేసి ఏడు గెలిస్తే, బీజేపీ 28 పోటీ చేసి కేవలం 9 మాత్రమే గెలిచామని ఆ పార్టీ చీఫ్ విప్ శ్రీరంగ్ బర్నే అన్నారు. తక్కువ సీట్లు వచ్చిన పార్టీలకు మంత్రి పదవులు దక్కడం ఎండీఏలో అసంతృప్తిని బయటపెట్టింది.

సీట్ల పంపకంలో లొల్లి

మహారాష్ట్రలో లోక్‌సభ ఎన్నికల్లో మంచి ఫలితాలు సాధించిన ఎంవీఏలోనూ విభేదాలు మొదలయ్యాయి. శాసనమండలి ఎన్నికలు కాంగ్రెస్, శివసేన(ఉద్ధవ్ ఠాక్రే) మధ్య చిచ్చు రేపాయి. ప్రస్తుతం నాలుగు పట్టభద్రులు, ఉపాధ్యాయ కోట శాసనమండలి స్థానాలకు ఎన్నికలు జరుగుతున్నాయి. వీటిలో స్థానాలకు తాము పోటీ చేసి, మరో రెండు వాటిని శివసేన(ఉద్ధవ్ ఠాక్రే)కు వదిలేయాలని కాంగ్రెస్ భావించింది. అయితే, ఉద్ధవ్ ఠాక్రే మొత్తం నాలుగు స్థానాలకు తామే పోటీ జరిగింది. దీనిని పీసీసీ చీఫ్ నానా పటోలే తప్పుపట్టారు. తమను సంప్రదించకుండానే ఠాక్రే ఈ ప్రకటన చేసినట్లు తెలిపారు. తర్వాత కూడా స్పందించడం లేదని చెప్పారు. దీంతో రెండు పార్టీల మధ్య విభేదాలు బయటపడ్డాయి.

# వయనాడ్‌ను వదులుకోనున్న రాహుల్.. ఉపఎన్నిక బరిలో ప్రియాంక?!

న్యూఢిల్లీ: కాంగ్రెస్ అగ్రనేత ప్రియాంకా గాంధీ (ప్రియాంక గాంధీ) ప్రత్యక్ష ఎన్నికల్లో పోటీ అంశం మరోసారి తెరపైకి వచ్చింది. లోక్‌సభ ఎన్నికల్లో కాంగ్రెస్ కంచుకోటలైన అమేథి లేదా రాయ్‌బరేలీ నుంచి ఆమెకు టికెట్ ఇస్తారనే ప్రచారం జోరుగా జరిగింది. అయితే చివరికి ఆమె అసలు పోటీకే దూరంగా ఉన్నారు. తాజాగా ప్రియాంక వయనాడ్ నుంచి బరిలోకి దిగుతారని ప్రచారం జరుగుతోంది. సార్వత్రిక ఎన్నికల్లో ఆమె సోదరుడు రాహుల్ గాంధీ.. వయనాడ్, రాయ్‌బరేలీ నుంచి భారీ మెజార్టీతో విజయం సాధించారు. అయితే ఒక స్థానం నుంచి మాత్రమే ఆయన కొనసాగాల్సి ఉంటుంది. ఈ నేపథ్యంలో రాహుల్ తన సోదరి కోసం వయనాడ్ స్థానానికి రాజీనామా చేయబోతున్నారు, అక్కడ జరిగే ఉపఎన్నికలో ప్రియాంక పోటీచేస్తారని పార్టీ వర్గాలు వెల్లడించాయి. 2019లో ప్రత్యక్ష రాజకీయాల్లోకి వచ్చిన ప్రియాంక.. అప్పుడు జరిగిన లోక్‌సభ ఎన్నికల్లో వారణాసి నుంచి ప్రధాని మోదీపై పోటీచేస్తారని ప్రచారం జరిగింది. అమెకు కాంగ్రెస్ పార్టీ టిక్కెట్ ఇవ్వడ అదంతా ఒట్టి ప్రచారమేనని తేలిపోయింది. తర్వాత 2022లో జరిగిన ఉత్తరప్రదేశ్ అసెంబ్లీ ఎన్నికల్లో ప్రచార బాధ్యతలను తన భుజాలపై వేసుకున్నారు. విస్తృతంగా ప్రచారం నిర్వహించారు. తానే ముఖ్యమంత్రి అభ్యర్థినంటూ కూడా. కానీ, తర్వాత ఆ మాటలను వెనక్కి తీసుకున్న



ఆమె.. ఎన్నికల్లో పోటీచేయడం లేదని తేలింది. ఇక తాజాగా జరిగిన లోక్‌సభ ఎన్నికల్లో తన తల్లి సోనియా గాంధీ ఇన్నాళ్లూ ప్రాతినిధ్యం వహించిన రాయ్‌బరేలి నుంచి పోటీచేస్తారని అంతా అనుకున్నారు. కానీ అక్కడ రాహుల్ పోటీచేసి విజయం సాధించారు. అయితే కేరళలో అసెంబ్లీ ఎన్నికల రాహుల్.. వయనాడ్‌ను అట్టిపెట్టుకుని రాయ్‌బరేలి స్థానానికి రాజీనామా చేస్తారనే ప్రచారమూ జరిగింది. అయితే ఇప్పుడు వయనాడ్నూ ఆయన వదిలిపెడతారని చర్చ జరుగుతోంది.

# వంశీ వర్సెస్ ఎమ్మెల్యేలు.. ఎంపీ స్థానం ఓటమిపై రాజుకుంటున్న అగ్గి

మహబూబ్‌నగర్,మహబూబ్‌నగర్ లోక్‌సభ స్థానంలో కాంగ్రెస్ ఓటమి చెందడానికి పార్టీలోని వర్గవిభేదాలే కారణమన్న గుసగుసలు వినిపిస్తున్నాయి. తక్కువ ఓట్లతో వంశీచంద్‌రెడ్డి ఓటమికి సిట్టింగ్ ఎమ్మెల్యేలే కారణమన్న విమర్శలు వినిపిస్తున్నాయి. సంస్థాగతంగా బలం లేని బీజేపీని ఓడించడం.. ఓటమి బాధతో ఉన్న బీఆర్ఎస్‌ను లెక్కలోకి తీసుకోకుండా ఇక గెలుపు తమదేనని ధీమా వ్యక్తం చేశారు. కానీ ఎన్నికల్లో ఏడు అసెంబ్లీ సెగ్మెంట్లలో మూడు సెగ్మెంట్లు మినహా మిగిలిన వాటిలో బీజేపీకి భారీ మెజారిటీ వచ్చింది. ఏడు నియోజకవర్గాల్లో కాంగ్రెస్ ఎమ్మెల్యేలు ప్రాతినిధ్యం వహిస్తున్నా.. ముఖ్యమంత్రి సొంత జిల్లాలోనే పార్టీ అభ్యర్థి ఓడిపోవడంపై అధిష్ఠానం గుర్రుగా ఉన్నట్టు సమాచారం. ఆయా అసెంబ్లీ సెగ్మెంట్లలో కొందరు ఎమ్మెల్యేలు కావాలనే ఓడించారని ఏఐసీసీ నేత రాహుల్‌గాంధీకి వంశీ ఫిర్యాదు చేశారట. వారిపై క్రమశిక్షణ చర్యలు తీసుకున్నట్లు తెలిసింది. వారికి రాబోయే రోజుల్లోనూ ఎలాంటి పదవులు ఇవ్వొద్దని సూచించారట. ఇదిలావుండగా ఎంపీ ఎన్నికల ప్రచారానికి వచ్చిన సీఎం రేవంత్‌రెడ్డి.. మక్తల్ ఎమ్మెల్యే శ్రీహరికి మంత్రి పదవి ఇస్తానని ప్రకటించడంతో బీసీ సామాజిక వర్గానికి గౌరవం దక్కుతుందని అంతా భావించారు. కానీ అదే నియోజకవర్గంలో బీజేపీకి భారీ లీడ్ రావడంతో పాటు ఇతర సామాజిక వర్గాల నేతలు ఎమ్మెల్యేకు మంత్రి పదవి వద్దని సూచిస్తున్నారు. దీంతో స్పందించిన ఎమ్మెల్యే వర్గం ఎదురుదాడికి దిగింది. బీసీ సామాజిక వర్గానికి చెందిన ఎమ్మెల్యేని టార్గెట్ చేస్తున్నారంటూ రెడ్డి వర్గంపై విరుచుకుపడింది. కాగా అధికారం మళ్లీ చేపట్టిన కొన్ని రోజులకే ఆయా నియోజకవర్గాల్లో ఎమ్మెల్యేలు దందాలో మునిగిపోయిన సమాచారం. కొందరు ఇసుక దందా.. మరికొందరు మట్టిదందా.. చిన్న చిన్న కాంట్రాక్టు పనులు చేజిక్కించుకున్నారు. ఇంకా పైరవీలు కూడా పెద్ద ఎత్తున ఉన్నాయి. నారాయణపేట ఏర్పాటు ఓ ఎమ్మెల్యే తన బంధువులతో ఏకంగా ఇసుక దందాకు తెరలేపారు. దీన్ని కొంతమంది నేతలు చెక్ పెట్టారు. మిగిలిన నియోజకవర్గాల్లో కూడా ఇదే పరిస్థితి ఉంది. ఇక ఉమ్మడి జిల్లా అయితే బీజేపీకి లీడ్ రావడంతో సిట్టింగ్ ఎమ్మెల్యే అభివృద్ధిలో కలిసి పోదాం చేసిన ప్రకటన కాంగ్రెస్ వర్గాలను విస్మయానికి గురిచేసింది. ఇదంతా కావాలని కొందరు ఎమ్మెల్యేలు పనిగట్టుకొని పార్టీ అభ్యర్థిని ఓడించాలనే ప్రచారం జోరందుకుంది.



సీఎంను కలవాలంటేనే నేతల్లో భయం

ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సొంత జిల్లాలో పార్టీ ఎంపీ ఓడిపోవడంపై రాష్ట్రవ్యాప్తంగా చర్చ జరుగుతోంది. ఏడు సెగ్మెంట్లలో అధికార పార్టీ ఎమ్మెల్యేలు ఉండి కూడా ఏ మాత్రం క్యాడర్ లేని బీజేపీ గెలవడాన్ని జీర్ణించుకోలేక పోతున్నారు. ఇక సీఎం కూడా సొంత జిల్లాలో కొందరు నేతలు హ్యాండిచ్చారని బాహాటంగా చెబుతున్నారు. రాష్ట్రంలో ఇతర చోట్ల భారీ మెజారిటీతో గెలిచినా.. సొంత జిల్లాలో మాత్రం కొద్దిపాటి ఓట్ల తేడాతో ఓటమి పాలు కావడంతో రాజకీయ విమర్శలు చెలరేగాయి. ఈ నేపథ్యంలో కొందరు నేతలు కావాలని బీజేపీకి మద్దతుగా గుసగుసలు వినిపిస్తున్నాయి.

# జూలై రెండో వారంలో రాష్ట్ర బడ్జెట్



హైదరాబాద్:లోక్‌సభ ఎన్నికల కోడ్ ముగిసిన నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వం అసెంబ్లీ వర్షాకాల సమావేశాల నిర్వహణపై దృష్టి సారించింది. ఆ సమావేశాల్లోనే పూర్తి స్థాయి బడ్జెట్‌ను ప్రవేశపెట్టేందుకు సన్నాహాలు ప్రారంభించింది. ఎంపీ ఎలక్షన్లు, సంబంధిత నోటిఫికేషన్, కోడ్ కారణంగా రేవంత్ సర్కారు గత మార్చిలో ఓటాన్ అకౌంట్ బడ్జెట్‌ను ప్రతిపాదించిన సంగతి విదితమే. అయితే నిబంధనల ప్రకారం జులై చివరి నాటికి పూర్తి స్థాయి పద్దును అసెంబ్లీకి సమర్పించాల్సి ఉంటుంది. ఈ క్రమంలో వివిధ శాఖల నుంచి ప్రతిపాదనలను స్వీకరించాలంటూ డిప్యూటీ సీఎం, ఆర్థిక మంత్రి మల్లు భట్టి విక్రమార్క ఉన్నతాధికారులను ఆదేశించారు. ఈ మేరకు సీఎస్ శాంతి కుమారి, ఆర్థిక శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు అన్ని శాఖలకు సమాచారం అందించారు. ఈనెల 18 నుంచి డిప్యూటీ సీఎం%ౌ% మంత్రులతో విడివిడిగా భేటీ అవుతారు. ఒక్కో రోజు ఒక్కో శాఖపై పూర్తి స్థాయిలో సమీక్ష నిర్వహిస్తారు. మార్చిలో ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో ఆయా శాఖలకు కేటాయించిన నిధులు, వాటిలో ఎంత మేర ఖర్చయింది..? కేంద్రం నుంచి వచ్చిన గ్రాంట్లు, సహాయాల పరిస్థితిపై ఆయన కూలంకుశంగా చర్చించనున్నారు. ఆ సందర్భంగా సంబంధిత మంత్రులతో సమాలోచనలు చేయనున్నారు. లోక్‌సభ ఎన్నికల కారణంగా కేంద్రం కూడా మార్చిలో ఓటాన్ అకౌంట్ బడ్జెట్‌నే ప్రవేశపెట్టింది. అందువల్ల ఇప్పుడు ఎన్డీయే సర్కారు కూడా పూర్తి స్థాయి పద్దును పార్లమెంటుకు సమర్పించాల్సి ఉంటుంది. ఆ పద్దులో రాష్ట్రానికి ఇచ్చే గ్రాంట్లు, ఇతర ఆర్థిక సహాయాలను పరిశీలించిన తర్వాత రాష్ట్ర ప్రభుత్వం ఇక్కడ తన పద్దుకు తుది మెరుగులు దిద్దనుంది. సీఎం రేవంత్ అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా ప్రజలకు అనేక హామీలిచ్చిన సంగతి విదితమే. ఆరు గ్యారెంటీల్లో భాగంగా మహాలక్ష్మీ, ఇందిరమ్మ ఇండ్లు, గృహజ్యోతి, చేయూత, రైతు భరోసా కోసం గ్రామ సభల ద్వారా మొత్తం 1.28 కోట్ల మంది దరఖాస్తు చేసుకున్నారు. వెరిఫికేషన్ తర్వాత 1.09 కోట్ల అప్లికేషన్లు మిగిలినట్టు ప్రభుత్వం ప్రకటించింది. వీటిలో అత్యంత కీలకమైన రైతు భరోసా కోసం రైతులు, ఇందిరమ్మ ఇండ్ల కోసం పేదలు ఆశగా ఎదురు చూస్తున్నారు. రైతు భరోసాను అమలు చేయాలంటే బడ్జెట్‌లో సుమారు రూ.15 వేల కోట్లు (ఎకరానికి రూ.7,500 చొప్పున రెండు పంటలకు కలిపి రూ.15 వేలు) కేటాయించాలి. ఇందిరమ్మ ఇండ్లకు కూడా పెద్ద మొత్తంలో నిధులు అవసరమవుతాయని అధికారులు అంచనా వేస్తున్నారు. మరోవైపు గత బీఆర్ఎస్ సర్కారు రూ.7 లక్షల కోట్ల మేర అప్పు చేసిందంటూకాంగ్రెస్ ప్రభుత్వం అసెంబ్లీలో శ్వేతపత్రాన్ని ప్రకటించింది. ఈ అప్పుకు నెలకు రూ.1,700 కోట్ల నుంచి రూ.1,800 కోట్ల వరకూ వడ్డీలు చెల్లించాల్సి వస్తోంది. వెరసి ఖజానాపై విపరీతమైన భారం పడుతోంది. ఇదిగాక ఆగస్టు 15 నాటికి రైతులకు రుణమాఫీ చేసి తీరాలని సీఎం రేవంత్ నిర్ణయించారు. 'స్థానిక సంస్థల ఎన్నికల' నేపథ్యంలో ఎట్టి పరిస్థితుల్లోనూ దాన్ని ఆపకూడదని ఆయన భావిస్తున్నారు. ఇందుకోసం రూ.35 వేల కోట్లు కావాలని అధికారులు సీఎంకు తెలిపారు. ఇలాంటి ప్రతిష్టాత్మక పథకాలకు పూర్తి స్థాయి బడ్జెట్‌లో నిధులు కేటాయించాల్సి ఉంటుంది. ఆసరా పింఛన్లు రూ.4 వేలకు పెంపు, రైతు భరోసా తదితరాలను అమలు చేయటంలో జాప్యం చోటు చేసుకోవటంతో ప్రజలు కాంగ్రెస్ ప్రభుత్వం పట్ల ఒకింత గుర్రుగా ఉన్నారు. మొన్నటి లోక్‌సభ ఎన్నికల్లో బీజేపీ ఎనిమిది సీట్లు గెలవటానికి ఈ అంశాలు కొంతలో కొంత ఉపయోగపడ్డాయని రాజకీయ విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. ఇలాంటి పరిస్థితుల్లో వీలైనంత త్వరగా రైతు భరోసా, రైతు రుణ మాఫీ హామీలను అమలు చేయటం ద్వారా 'స్థానిక సమరం'లో మరింతగా సత్తా చాటాలని సీఎం రేవంత్%ౌ% తన సన్నిహితులతో చెప్పినట్టు సమాచారం. ఈ క్రమంలోనే ఈనెల 18న నిర్వహించబోయే రాష్ట్ర మంత్రివర్గ సమావేశంలో పూర్తి స్థాయి బడ్జెట్‌తోపాటు రైతు రుణమాఫీపై చర్చించి పలు కీలక నిర్ణయాలను వెలువరించనున్నారని ఓ ఉన్నతాధికారి వివరించారు. బడ్జెట్ కసరత్తులు అనుకున్నంత వేగంగా పూర్తయితే జులై రెండో వారంలో, లేదంటే ఆ నెల మూడో వారంలో అసెంబ్లీ సమావేశాలు నిర్వహించే అవకాశముందని ఆయన అభిప్రాయపడ్డారు.

# బాలయ్యా...ఇక ఎప్పటికీ ఇంతేనయ్యా...?



అమరావతి,నందమూరి తారక రాముని సినీ వారసుడు బాలకృష్ణ. ఆయన సినీ వారసత్వాన్ని విజయవంతంగా కొనసాగిస్తున్నారు. మరో రెండు నెలల్లో యాభై ఏళ్ల సినీ కెరీర్ ని బాలయ్య జరుపుకోబోతున్నారు. సినీ రంగంలో ఆయన సక్సెస్ లు చాలా ఉన్నాయి. ఆ రికార్డుల విషయం పక్కన పెడితే రాజకీయ రంగంలోనూ బాలయ్య విజయవంతంగా కొనసాగుతున్నారు. ఎంతో మంది సినీ నటులు రాజకీయాలలోకి వచ్చి ఒక్కసారే గెలిచారు. తరువాత ఎన్నికల్లో ఓటమి మూటగట్టుకున్నారు. కానీ బాలయ్య అలా కాదు ఓటమి ఎరుగని వీరుడుగా ఉన్నారు. హిందూపురం నుంచి ఆయన 2014లో పోటీ చేసి గెలిచారు. 2019లో రెండోసారి జగన్ వేవ్ లో సైతం మెజారిటీని పెంచుకున్నారు. 2024లో హ్యాట్రిక్ ఎమ్మెల్యే అయ్యారు. ఒక వైపు సినిమాలు చేస్తూ మరో వైపు తన సొంత నియోజకవర్గం అభివృద్ధికి బాలయ్య చేస్తున్న కృషి ప్రశంసనీయం అని అంటారు. ఇంతలా బాలయ్య రాజకీయాల్లో రాణిస్తున్నా కనీసం ఆయనకు మంత్రి పదవి అయినా ఎందుకు దక్కడం లేదు అని అభిమానులు మధన పడుతున్నారు. మా బాలయ్యకు ఏమి తక్కువ అని వారు ప్రశ్నిస్తున్నారు. తాజాగా చంద్రబాబు కొత్త మంత్రివర్గం కొలువు తీరింది. అందులో ఒక్కసారి ఎమ్మెల్యేగా గెలిచిన వారు మంత్రులు అయ్యారు. మరి బలమైన రాజకీయ వారసత్వంతో పాటు ప్రముఖ సినీ నటుడిగా ఉంటూ హ్యాట్రిక్ కొట్టి రాజకీయాల్లో విజయాల కోసం చవి చూస్తున్న బాలయ్యకు మంత్రి పదవి దక్కలేదని ఫ్యాన్స్ ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. బాలయ్య మంత్రి కావడానికి అర్హుడు కారా అని అంటున్నారు. నిజానికి ఇప్పటికి నాలుగు దశాబ్దాల క్రితం సీనియర్ ఎన్టీఆర్ బాలయ్యను చూసి అతడే నా రాజకీయ వారసుడు అని మదనపల్లి సభలో ప్రకటించారు. ఇది 1987లో జరిగిన ముచ్చట. ఆనాడు బాలయ్య హీరోగా ఉంటూనే టీడీపీ కోసం ప్రచారం చేస్తూ వచ్చారు. ఎన్టీఆర్ పాల్గొన్న సభలో బాలయ్య ప్రసంగించిన తీరుని చూసిన ముచ్చట పడిన అన్న గారు అన్న మాటలు. అంటే పెద్దాయనకు బాలయ్య రాజకీయంగా అందాలు ఎక్కాలని కోరిక ఉందని అర్థం అవుతోంది. అయితే బాలయ్య కాస్త లేటుగా ప్రత్యక్షంగా రాజకీయాల్లోకి వచ్చారు. ఆయన 2014లో వచ్చిన సమయంలోనే మంత్రి అయి ఉండాల్సింది. కానీ ఆనాడు దక్కలేదు. ఇక 2019లో చూస్తే టీడీపీ ఓటమి పాలు అయింది. 2024లో పార్టీ గెలిచింది బాలయ్యకు ఎదురులేదు అని అంతా అనుకున్నారు. కానీ ఆయన పేరు ఏ దశలోనూ పరిశీలనలో లేదని అంటున్నారు. ఉమ్మడి అనంతపురం జిల్లా నుంచి పయ్యావుల కేశవ్ తో పాటు బీసీ మహిళా నేత ఎస్ సవితకు ఛాన్స్ ఇచ్చారు. బీజేపీ నుంచి సత్యకుమార్ యాదవ్ కి మంత్రి పదవి దక్కింది. బాలయ్యకు మంత్రి పదవి ఇవ్వాలంటే సామాజిక వర్గ సమీకరణలు అడ్డు వస్తున్నాయని అంటున్నారు. ఉమ్మడి అనంతపురం జిల్లాలో పరిటాల పయ్యావుల కుటుంబాలు రాజకీయంగా గట్టిగానే ఉన్నాయి. పయ్యావుల మూడు దశాబ్దాలుగా రాజకీయాల్లో తొలిసారి మంత్రి అయ్యారు. ఆయనకు ఇవ్వడం సముచితం. దాంతో బాలయ్యకు దక్కలేదు అని అంటున్నారు. మరి విస్తరణలో ఏమైనా మార్పు చేర్పులు ఉంటే బాలయ్యకు మంత్రి యోగం ఉంటుందా అంటే అది కూడా డౌటే అంటున్నారు. ఎందుకంటే ఇప్పటికే ప్రభుత్వంలో చంద్రబాబు నారా లోకేష్ ఉన్నారు. బాలయ్యని కూడా తీస్తే కుటుంబం మొత్తం ఉన్నారు అంటారు. దాంతో బాలయ్యా ఇక ఇంతేనయ్యా అని అనుకోవడం అభిమానుల వంతు అవుతోంది. బాలయ్య తెలుగుదేశం పార్టీకి గత నాలుగు దశాబ్దాలుగా సేవ చేస్తున్నారు. 1984 నుంచి మొదలుపెట్టి లోక్ సభ అసెంబ్లీ స్థానిక సంస్థల ఎన్నికల వరకు ఆయన ఎన్నికల ప్రచారం చేస్తూ వస్తున్నారు. పార్టీ కోసం బాలయ్య బాగా కష్టపడుతున్నారని అంటున్నారు. మరి బాలయ్యకు ఈ దఫా కనుక మంత్రి పదవి దక్కకపోతే వచ్చే ఎన్నికల నాటికి ఆయనకు 69 ఏళ్లు వస్తాయి. మరి ఆయన పోటీ చేస్తారో కూడా తెలియదు. దాంతో జస్ట్ ఎమ్మెల్యేగానే అన్న గారి వారసుడు పొలిటికల్ గా మిగిలిపోతారా అన్న చర్చ కూడ సాగుతోంది.

## ప్రహరీగోడ కూలి ముగ్గురు కూలీల దుర్మరణం

మంచిర్యాల,మంచిర్యాల జిల్లాలో దారుణం చోటు చేసుకుంది. ప్రహరీ గోడ కూలీ ముగ్గురు కూలీలు మృతి చెందారు. ఈ విషాదకర సంఘటన జిల్లా కేంద్రంలోని బెల్లంపల్లి చౌరస్తా వద్ద గురువారం చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళ్తే.. ఓ ఇంటి నిర్మాణం కోసం పునాది తవ్వుతుండగా ఒక్కసారిగా కంపౌండ్ వాల్ కూలీపై పడటంతో అక్కడికక్కడే మృతి చెందారు. రెండు మృతదేహాలను వెలికి తీయగా మరో మృతదేహాన్ని వెలికితీసేందుకు ప్రయత్నిస్తున్నారు.

# ఫోన్ ట్యాపింగ్ కేసులో మరో కీలక మలుపు..

హైదరాబాద్ : తెలంగాణలో ఫోన్ ట్యాపింగ్ ప్రకంపనలు ఇంకా కొనసాగుతూనే ఉన్నాయి. మునుగోడు ఉప ఎన్నిక సమయంలో ఓ ఐపీఎస్ అధికారితోపాటు పాటు ఓ డీఎస్పీ బీఆర్ఎస్‌కు సహకారం అందించినట్టు దర్యాప్తులో వెలుగుచూసింది. అంతేకాదు, తెరవెనుక మరికొందరు అత్యున్నతస్థాయి పోలీసులు ఉన్నట్టు సమాచారం. వారి మౌఖిక ఆదేశాలతో ఐపీఎస్ అధికారి నేతృత్వంలోని బృందం నగదు సరఫరాను పర్యవేక్షించిట్టు తెలిసింది. దర్యాప్తులో మున్ముందు సహకారం అందించిన అత్యున్నతస్థాయి అధికారుల పేర్లు కూడా బయటకు వచ్చినట్టు సమాచారం.

మునుగోడు ఉప ఎన్నికలో బీఆర్ఎస్ అభ్యర్థి కోసం నిబంధనలకు విరుద్ధంగా డబ్బు సరఫరా చేసేందుకు ఫార్చునర్ వాహనాన్ని వినియోగించారు. ఆ వాహనానికి ఎస్కార్ట్‌గా వ్యవహరించిన కానిస్టేబుల్ వాంగ్మూ లం ఆధారంగా ఈ విషయం వెలుగుచూసింది. ఐపీఎస్ అధికారితోపాటు స్పెషల్ బ్రాంచ్ వ్యవహారాలను పర్యవేక్షించిన డీఎస్పీ ఆదేశాలతోనే తాను ఆ వాహనానికి ఎస్కార్ట్‌గా వ్యవహరించినట్టు నల్గొండకు చెందిన ఆ కానిస్టేబుల్ తన వాంగ్మూలంలో పేర్కొన్నాడు. అంతేకాదు, అప్పుడేం జరిగిందన్న విషయాన్ని పూర్తిగా వివరించాడు. మరో ఇద్దరు కానిస్టేబుళ్లు కూడా ఇదే విషయాన్ని ధ్రువీకరించారు. మునుగోడు ఉప ఎన్నికల సమయంలో తాను నల్గొండ టాస్క్‌ఫోర్స్‌లో పనిచేశానని, ఐపీఎస్ అధికారి ఆదేశాల మేరకు డీఎస్పీ తనను తీసుకెళ్లారని ఆ కానిస్టేబుల్ తన వాంగ్మూలంలో పేర్కొన్నాడు. నవంబరు 1న




తప్ప 2022 అక్టోబరు 26 నుంచి నవంబర్ 2 వరకు ప్రతి రాత్రి ఫార్చునర్ వాహనానికి ఎస్కార్ట్‌గా వ్యవహరించినట్టు వివరించాడు. ఆ వాహనంలోనే బీఆర్ఎస్ అభ్యర్థి డబ్బును తరలించారని తెలిపాడు. అక్టోబర్ 31న జరిగిన బహిరంగ సభలో అప్పటి ముఖ్యమంత్రి పాల్గొన్నారని, ఆ సభలోనే తమ డీఎస్పీ ఓ ఐపీఎస్ అధికారిని చూపించి, కేసీఆర్‌తో ఆయనకు సన్నిహిత సంబంధాలు ఉన్నాయని చెప్పారని, ఆయన ఆదేశాల మేరకు డబ్బును సరఫరా చేస్తున్నట్టు వివరించారని పేర్కొన్నారు. ఆ తర్వాతే ఆ అధికారి నాయిని భుజంగరావు (ఫోన్ ట్యాపింగ్ కేసు నిందితుడు) అని తనకు తెలిసిందని ఆ కానిస్టేబుల్ తన వాంగ్మూలంలో పూసగుచ్చినట్టు వివరించాడు.

# నామినేటెడ్ పదవులపై నేతల ఆరా...

మహబూబ్‌నగర్,ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలో నామినేటెడ్ పదవులపై కాంగ్రెస్ నేతలు దృష్టి పెట్టారు. తమకు పదవు కోసం అందుబాటులో ఉన్న నేతలతో చర్చిస్తున్నట్లు సమాచారం. జిల్లాలో 19వ్యవసాయ మార్కెట్‌లు ఉండగా షాద్ నగర్, ఆమనగల్లు, కొడంగల్ పట్టణాలు రంగారెడ్డి, వికారాబాద్ జిల్లాలోకి వెళ్లాయి. ప్రస్తుతం ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 16మార్కెట్‌లు పనిచేస్తున్నాయి. మహబూబ్‌నగర్, బాదేపల్లి, నాగర్ కర్నూల్, గద్వాల, మధనాపురం, మక్తల్, అలంపూర్, వనపర్తి, కల్వకుర్తి, అచ్చంపేట, నారాయణపేట, దేవరకద్ర, కొల్లాపూర్, కోస్గీ, ఆత్మకూర్, మార్కెట్ కమిటీలు కొనసాగుతున్నాయి. మార్కెట్ కమిటీ నామినేటెడ్ పోస్టుల భర్తీ విషయంలో గత ప్రభుత్వం మొదటిసారి రిజర్వేషన్ల వ్యవస్థను తీసుకువచ్చింది. అందుకు అనుగుణంగా నాయకులు పైరవీలు మొదలు పెట్టారు. అలాగే ఉమ్మడి జిల్లాలోని పలు ఆలయాలకు పాలక మండళ్ల ఏర్పాటు చేసేందుకు రంగం సిద్ధం చేస్తున్నారు. అందులో భాగంగా ఛైర్మన్, వైస్ చైర్మన్, కమిటీ సభ్యుల పోస్టుల కోసం హస్తం పార్టీ నేతలు ప్రయత్నాలు ముమ్మరం చేస్తున్నారు. ఇప్పటికే గద్వాల్‌లోని జోగుళాంబ అమ్మవారి ఆలయంతో పాటు ఇతర ముఖ్యమైన ఆలయాల పాలక మండలి ఛైర్మన్ పదవుల కోసం పార్టీ ముఖ్య నేతల పైరవీల కోసం తిరుగుతున్నారు. ఇప్పటికే కొన్ని నియోజకవర్గాల్లో ఎమ్మెల్యేలు హామీలు సైతం ఇచ్చారు. పదేళ్ల సుదీర్ఘ విరామం తర్వాత వచ్చిన అవకాశాన్ని వదులుకోవద్దని హస్తం క్యాడర్ భావిస్తోంది. దీంతో పదవుల కోసం నేతల చుట్టూ పోటాపోటీగా నాయకులు చక్కర్లు కొడుతున్నారు.

Printed, Published and Owned by UPPUGALLA SANTHOSH KUMAR H.NO. 10-19/286/1, RAVINDRA NAGAR COLONY, NAGARAM VILLAGE, KEESERA MANDAL, DIST.RANGA REDDY, PIN -500083, TELANGANA, Printed at SRI SAI GRAPHICS 9-52/3, ROAD NO.8, S.V.NAGAR, NAGARAM KEESARA, DIST. RANGA REDDY, PIN -500083, TELANGANA . RNI No : TELTEL/2015/66279 Editor : UPPUGALLA SANTHOSH KUMAR Cell : +918247019090. Email : agranetha@gmail.com